ఫలితాలను మంగళవారం ఏఎన్‌యు వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ విడుదల చేశారు. బి.ఏ, బి.కాం (జనరల్, కంప్యూటర్స్), బి.యస్సీ, బి.హెచ్‌యం కోర్సుల ఫలితాలు విడుదల చేసినట్లు దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల కోఆర్డినేటర్ డాక్టర్ కె.సోమశేఖర్ మాట్లాడుతూ ఫలితాలకు సంబందించి ఎవరైనా రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే ఒక్కో పేపర్‌కు రూ.770లను ఈనెల 30వ తేదీలోగా ఫీజు చెల్లించి వచ్చే నెల 3వ తేదీలోగా కో-ఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలని సూచించారు. కోర్సు పూర్తిచేసుకున్న అభ్యర్థులకు సకాలంలోనే సర్టిఫికెట్‌లు పంప నున్నట్లు వివరించారు. ఈ సందర్భంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజి స్ట్రార్ ఆచార్య బండి కరుణ, ఇంజనీరింగ్ డీన్ ఆచార్య పి.సిద్దయ్య, దూరవిద్య డిప్యూటీ రిజిస్ట్రార్ సి.హెచ్.ఉషారాణి, సిటిఏ డాక్టర్ నాగరాజు, సూర్య సిస్టమ్ ప్రతినిధి వలి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యు విద్యార్థులకు ఉచితంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ




**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు13, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో విద్యార్థిని విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణను ఉచితంగా అందిస్తున్నట్లు ఏఎన్‌యు వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ వెల్లడించారు. మంగళవారం వర్సిటీ వ్యాయామ విద్య కళాశాల ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ డైనమిక్ కరాటే సంస్థ మార్షల్ ఆర్ట్స్ శిక్షణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ సంస్థ నిర్వాహకులు కిషోర్ శిక్షణ ఉద్దేశాలను వివరించారు. ఏఎన్‌యు విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తామని పేర్కొన్నారు. ఈ కోర్సు నేర్చుకోవాలనుకునేవారికి ఉచితంగా యూనిఫామ్ అందిస్తామని వీసి ప్రకటించారు. బాలబాలికలకు వేర్వేరుగా ఈశిక్షణ ఉంటుందని వివరించారు. ఈ శిక్షణకు ఒక్కరు హాజరైనా కూడా తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వ్యక్తిగత శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బండి కరుణ, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పి.ఎస్.పాల్‌కుమార్, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు, బాలబాలికల వసతిగృహాల ఛీఫ్ వార్డెన్, వార్డెన్‌లు డాక్టర్ నాగరాజు, డాక్టర్ రవిశంకర్ రెడ్డి, డాక్టర్ షకీలా, డాక్టర్ అఖిలా జాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే ధ్యేయంగా గడపగడపకు మన ప్రభుత్వం

### ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో విఫలమవుతున్న ప్రజాప్రతినిధులు



గడప గడప కార్యక్రమంలో సమస్యలను వివరిస్తున్న మహిళ

**సచివాలయం, సెప్టెంబర్13, ప్రభాతవవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమం పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా చేసే అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అయితే ఆదేశానుసారం ప్రజల్లోకి వెళుతున్నప్పటికీ మొక్కుబడిగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి కారణాలు గత మూడేళ్లుగా ప్రజలతో నేరుగా సత్సంబంధాలు కొనసాగించలేని ఎమ్మెల్యేలు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పథకాలు అందని కొందరు లబ్ధిదారులు నేరుగా ప్రశ్నించడంతో మొఖం చాటేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ముఖ్యంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు గ్రామ స్థాయి నుంచే వర్గాలుగా ఏర్పడి కార్యకార్తలకే సంక్షేమ పథకాలు అందించలేదన్న విమర్శలు ఉన్నాయి. దీనకి కొన్ని ఎస్సీ నియోజకవర్గాల్లో అగ్రవర్ణ నాయకత్వంతో పొసగని వైనంతో ఎమ్మెల్యేలు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. పలుచోట్ల అధికారపార్టీలో ఉన్న ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం గడప గడప కార్యక్రమంలోనే సదరు నేతలను నిలదీస్తున్నారు. దీంతో గడపగడపకూ మన ప్రభుత్వం తూతూమంత్రంగా రాష్ట్ర వ్యాప్తంగా అధికారులతో కలిసి తూతూ మంత్రంగా విమర్శలు వినిపిస్తున్నాయి.



# బయోపెస్టిసైడ్స్ వాడకంలో పొగాకు రైతులకు శిక్షణ

**జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త:** వర్జీనియా పొగాకు పండించే రైతులు నారుమళ్ళు పెంపకంలోనూ, పొగాకు తోటలు వేసేటప్పుడు సస్యరక్షణ కోసం టుబాకో బోర్డు అందించే సూచనలు, సలహాలను పాటించాలని పలువురు అధికారులు కోరారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని మార్కండేయపురం, చల్లావారిగూడెంలో మంగళవారం టుబాకో బోర్డు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం టుబాకో బోర్డు పొగాకు వేలం కేంద్రాలు 18, 32ల ద్వారా పొగాకు రైతులకు వర్జీనియా పొగాకు సాగులో బయోఫెస్టిసైడ్స్, బయోఫెర్టిలైజర్ తయారీ, వాడకంపై రైతులకు శిక్షణ, ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం 18లో మార్కండేయపురంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో టుబాకో బోర్డు, గుంటూరు హెడ్ ఆఫీస్‌నుంచి ఆక్షన్ మేనేజర్ జి.దామోదర్, సురేఖ, ఎన్ఐపీహెచ్ఎం హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు దామోదరాచారి, బసవరాజు జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం అధికారి బి.శ్రీహరి, రైతు నాయకులు కూచిపూడి రమేష్, ఎస్‌జీవో సుధీర్ పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం 32వవేలం కేంద్రం ద్వారా మండలంలోని చల్లావారిగూడెంలో జరిగిన శిక్షణకార్యక్రమంలో అధికారులు, శాస్త్రవేత్తలతో పాటు వేలం కేంద్రం నిర్వహణాధికారి మహేష్,ఎస్‌జీవోమహేష్,రైతునాయకులు సత్రంవెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ క్రీడలకు మూడు రోజల ప్రత్యేక సెలవులు

### పాత 13 జిల్లాల ప్రాతిపదికన ప్రతి జిల్లా నుండి 75 మంది చొప్పున 1200 క్రీడాకారులు

### విఆర్ఏ, విఆర్ఓలతో పాటు అటెండర్ నుండి డిప్యూటీ కలెక్టర్ల వరకు

### ఏపిజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు , చేబ్రోలు కృష్ణమూర్తి

**సచివాలయం. సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** రెవెన్యూ క్రీడలకు మూడు రోజుల పాటు ప్రత్యేక సెలవులను మంజూరు చేసిన ప్రభుత్వానికి ఏపిజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మరియు చేబ్రోలు కృష్ణమూర్తి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పని ఒత్తితో సతమతమవుతున్న రెవిన్యూ ఉద్యోగులకు కొంత మానసిక ఉల్లాసం కలిగించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సంవత్సర ం నవంబర్ 11 నుండి 13 వరకు రాష్ట్ర స్థాయి 6వ రెవిన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవాలను గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిదా ్యలయం నందు జరపాలని ఏపిఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందనా ్నరు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ చేసిన విజ్ఞప్తి మేరకు రెవిన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములలో పాల్గొనే క్రీడాకారులకు నవంబర్ 10. 2022 ( క్రీడాకారులందరూ వచే ్చ రోజు), నవంబర్ 11 (క్రీడలు ప్రారంభం రోజు), నవంబర్ 14 (క్రీడాకారులందరూ తిరిగి వెళ్లే రోజు) తేదిల మూడు రోజులు ప్రత్యేక సెలవులు (స్పెషల్ కాజువల్ లీవ్) లకు ప్రభుత్వం అనుమతించిందనా ్నరు. అలాగే నవంబర్ 12, 13 (క్రీడలు ముగింపు రోజు) తేదిలు ప్రభుత్వ సెలవు రోజుల అయినందున వాటిని కూడా వినియోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతిని మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ 6వ రాష్ట్ర స్థాయి క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవాలలో రెవిన్యూ శాఖలో గ్రామ స్థాయిలో పని చేస్తున్న గ్రామ రెవిన్యూ సహాయకులు (విఆర్ఏలు), గ్రామ రెవినూ ్య అధికారులు (విఆర్ఓలు), అటెండర్ నుండి డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ వరకు పాల్గొంటారన్నారు. పాత 13 జిల్లాల ప్రాతిపదికన ప్రతి జిల్లా నుండి 75 మంది చొప్పున మరియు సీసీఎల్ఏలు, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యు లందరు కలిపి దాదాపు 1200 మంది క్రీడాకారులు పాల్గొంటరన్నారు. రెనిన్యూ క్రీడలను విజయవంతం చేయుటకు ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కోరిన వెంటనే మూడు రోజుల పాటు ప్రత్యేక సెలవులు మంజూరు చేసిన ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ మరియు స్పెషల్ సీఎస్ జి.సాయి ప్రసాద్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఏపీ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలను సంఘ నాయకులు బొప్పరాజు మరియు చేబ్రోలు కృష్ణమూర్తి తెలిపారు.

# ప్లాస్టిక్ నిషేధంపై నిబంధనలు కఠినతరం

### ఉత్పత్తిదారులను గుర్తించి ప్రత్యామ్నాయాలు కల్పిస్తాం

### విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు: కమిషనర్ షాహిద్

**ప్రభాతవార్త-ఏలూరు:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో చేపట్టిన ప్లాస్టిక్ నిషేధంపై నిబంధనలు కఠినతరం చేసి పూర్తిగా ప్లాస్టిక్ నిరోధానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ షేక్ షాహిద్ స్పష్టం చేశారు. అదే విధంగా ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేసే ఉత్పత్తిదారులను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ రంగాలవైపు దృష్టిసారించే విధంగా మెప్మా శాఖ ద్వారా అవసరమైన ఆర్థిక సహకారం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ నివారణలో నగరపాలక సంస్థ సిబ్బంది కీలక భూమిక పోషించాల్సి వుందన్నారు. అందువల్ల సిబ్బంది ఎవరైనా విధుల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించే ప్రసక్తేలేదని, ప్లాస్టిక్ నిరోధానికి ప్రజలు కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు. మంగళవారం రాత్రి ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ షాహిద్ గ్రామదీప్ సంస్థ నిర్వాహకురాలు మహేశ్వరితో కలిసి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం జూలై 1వ తేదీ నుండి 17 రకాల ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏలూరు నగరంలో సింగిల్ విండో ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ప్లాస్టిక్ విక్రయదుకాణాలపై తనిఖీలు చేసి అపరాధ రుసుం విధించడం జరిగిందన్నారు. అలాగే ప్రధానంగా హోటళ్ళు, సినిమా థియేటర్లలో క్యాంటీన్లను తనిఖీ చేసి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించడం జరిగిందన్నారు. దశల వారీగా ప్లాస్టిక్ నిరోధానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. అలాగే ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో మట్టి కప్పులు, పింగానీ వస్తువులు, జ్యూట్ బ్యాగ్స్, పేపర్ ప్లేట్స్, ఇతరత్రా వాటిని వినియోగించే విధంగా నగరంలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ప్రధాన హోటళ్ళు, సినిమా థియేటర్లలో ప్లాస్టిక్ వినియోగంపై గట్టి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అదే విధంగా నిరంతరం మార్కెట్‌లో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది దుకాణాలపై తనిఖీలు చేస్తూ అపరాధ రుసుం విధిస్తున్నారన్నారు. త్వరలోనే ఏలూరు నగరంలో విలీనమైన పంచాయతీల్లో వున్న పరిశ్రమల ప్రాంతాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తి అయ్యే పరిశ్రమలను గుర్తించేందుకు పరిశ్రమల అధికారులను సమన్వయ పరుచుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ప్లాస్టిక్ నివారణను ఒక ఉద్యమంలా చేపట్టామని ఇందులో భాగంగానే కార్పొరేషన్ శాఖ, గ్రామదీప్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అదే సమయంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపర్చడానికి కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. నగరంలో ప్లాస్టిక్ ఫ్రీ జోన్స్‌ని ఏర్పాటు చేసే విధంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే ఆళ్ళనాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, పాలకవర్గం సహకారంతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలు సక్రమంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేందుకు పరిపాలనలో పలు మార్పులు చేశామన్నారు. ఎప్పటి నుండో కార్పొరేషన్‌లో వివిధ



ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ షేక్ షాహిద్

విభాగాల్లో పాతుకుపోయిన ఉద్యోగులను పరిపాలనా సౌలభ్యం రిత్యా వేరే విభాగానికి బదిలీ చేయడం జరిగిందన్నారు. పారిశుద్ధ్య విభాగంలో కార్మికులందరూ తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని పైరవీలు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేశామని, ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులపై సమీక్షలు నిర్వహిస్తూ అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ నిరోధానికి ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, అందువల్ల ప్రజలందరూ కూడా ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని కమిషనర్ షాహిద్ పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంహెచ్ఓలు గోపాల్ నాయక్, మాలతీరాణి, గ్రామదీప్ సంస్థ నిర్వాహకురాలు మనోహరి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
నెం.11/EE/TO/2022-23 ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 07.09.2022
అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం యందు సుమారు విలువ రూ. 6.54 లక్షలతో 1 నం.అత్యవసర మరమ్మతు పనికిగాను ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానింపబడుచున్నవి. టెండరు షెడ్యూళ్ల డౌన్‌లోడింగ్‌నకు తేది: 15.09.2022న మ.3.00గం.లు. మరిన్ని వివరముల కోసం https://tender.apeprocurement.gov.in ను చూడగలరు. ఫోన్ నెం. 292884(08497).
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, (R&B) డివిజను, కళ్యాణదుర్గం.
DIPR.No. 5889/CL/Advt/1/1/2022-23 తేది: 13.09.2022

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
నెం.12/EE/TO/2022-23 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 09.09.2022
అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం యందు సుమారు విలువ రూ. 6,30,000/-లతో ఒక అద్దె ఇన్స్‌పెక్షన్ వాహనాన్ని సరఫరాకు ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానింపబడుచున్నవి. టెండరు షెడ్యూళ్ల డౌన్‌లోడింగ్‌నకు తేది: 15.09.2022న మ.3.00గం.లు. మరిన్ని వివరముల కోసం https://tender.apeprocurement.gov.in ను చూడగలరు. ఫోన్ నెం. 292884(08497).
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, (R&B) డివిజను, కళ్యాణదుర్గం.
DIPR.No. 5890/CL/Advt/1/1/2022-23 తేది: 13.09.2022

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ
ఈ-వేలం ప్రకటన
No.PSO - II/e-auction/1/2020-21 తేది: 12.09.2022
ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే అనే ప్రాతిపదికన పనికిరాని వాహనాలు మరియు బస్ బాడీలు మొదలగు వాటి ఈ-వేలం ప్రభుత్వ పోర్టల్ తరఫున ఉపాధి టెక్నో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌వారిచే నిర్వహించబడును (ఫోన్ నెం. 7337318404/7337445545/7337445546). 1) కరీంనగర్ (KRMR) 12.10.2022. 2) ఉప్పల్ (HZ/UPL) 19.10.2022. రిజిస్ట్రేషన్, ఇతర వివరములకు https://auction.telangana.gov.in మరియు TSRTC యొక్క https://tsrtc.telangana.gov.in (Tenders) ను చూడగలరు.
DIPR.No.6666-PP/CL/Advt/1/2022-23 తేది: 13.09.2022 సం/-. చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్.

14-9Pg4 :Layout 1 14/09/22 10:16 PM Page 1



వార్త

సంకోచించే మనస్సుతో పనిచేసే వాడికి కార్యనాశనం తప్పదు.

–సోక్రటీస్

# ప్రజారోగ్యాన్ని పీల్చేస్తున్నదెవరు?

జనారోగ్యమే జాతికి మహాభాగ్యం, దేశప్రజలను పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాదికోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. అటు కేంద్రప్రభుత్వం కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కానీ లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. మన రాజ్యాంగ నిర్మాతలు కూడా ఆరోగ్యవిషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గురించి రాజ్యాంగంలో పొందుపరిచారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా నేటికీ దేశప్రజలందరికీ కనీస ఆరోగ్యవసతులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్రాల పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై రోగాల దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. కొన్ని వ్యాధులను కొందరు వ్యక్తులు తమకుతాముగా తెచ్చుకొని సమాజంపై వదులుతుంటే మరికొన్ని ప్రకృతి విసురుతున్నవిగా చెప్పొచ్చు. ఇవన్నీ కలిసి ప్రజారోగ్యంపై దాడుల పరంపర కొనసాగిస్తున్నాయి. భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులతో తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఆ ప్రభావంతో రకరకాల మహమ్మారులు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్నాయి. తమ నివాస ప్రాంతాల్లో వాతావరణం ఉన్నట్టుఉండి మారిపోవడంతో ఆ మార్పులు తట్టుకోలేక కొన్నిరకాల కీటకాలు, జంతువులు వేరే ప్రాంతాలకు వలసవెళ్లడం, అక్కడి వాతావరణం సరిపోక వైరస్‌ల ఉత్పరివర్తనాలు చోటు చేసుకుంటున్నాయి. గత ఒకటిన్నర దశాబ్దంగా ఎన్నో వైరస్‌ల వ్యాప్తిని వాతావరణ మార్పులకు పరోక్షంగా కారణం అవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు వెల్లడించాయి. ఇలా వస్తున్న వ్యాధుల్లో కొన్నింటిని నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యం కావడం లేదు. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవజాతిపై ప్రకృతి విసురుతున్న సవాల్‌కు వారూ వీరు అని తేడా లేకుండా అందరూ బలైపోతున్నారు. మన శక్తిముందు మానవుడు ఎప్పుడూ తలదించుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కొత్త కొత్త వ్యాధులు వస్తూనే ఉన్నాయి. కోట్లాదిమంది రోగపీడితులు అవుతున్నారు. లక్షల సంఖ్యలో ప్రాణాలు పోతున్నాయి. కొత్తగా ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా ప్రస్తుతం తాత్కాలికంగా కొంతమేరకు శాంతించింది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూవ్యాధి విజృంభించిందనే చెప్పొచ్చు. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులన్నీ కిటకిటలాడిపోతున్నాయి. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, చికెన్‌గున్యా తదితర వ్యాధుల నుంచి రోగనిరోధక శక్తిఉన్నవారు బయటపడిన దాఖలాలున్నట్లు వైద్యులు చెప్తున్నారు. అయితే మధుమేహం, గుండెపోటు తదితర వ్యాధులున్నవారు వీటిని తట్టుకోవడం కష్టమని జాగ్రత్తగా ఉండాలని సూచనలు ఇస్తున్నారు. ఒక్క అల్లోపతి డాక్టర్లే కాదు, ఆయుర్వేదిక్, హోమియో అన్ని విభాగాల డాక్టర్లు వైద్యరంగ నిపుణులందరూ శరీరంలోని ఇమ్యూనిటీని పెంచుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ఈ విషయం ఇప్పుడు కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో చెప్తున్నారు. అయితే ఈ వాస్తవాలు ప్రజలకు కూడా తెలుసు. అయినా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు? కారకులు ఎవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన తరుణమిది. రోగనిరోధకశక్తి ఒక్కరోజులోనో, వారం రోజులోనో, నెల రోజుల్లోనో పెరిగేది కాదు. బాల్యం నుండే సమతుల్యమైన మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందివ్వాలి. ఏమేరకు అందిస్తున్నామో, ఎంతవరకు అందుతున్నదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పౌష్టికాహారం లోపంతో దేశంలో ప్రధానంగా కోట్లాది మందినిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్థాకలితో అలమటిస్తున్నవారు కోట్ల సంఖ్యలోనే ఉన్నారు. వారికి రోగనిరోధక శక్తి ఎలావస్తుంది, ఎక్కడి నుండి వస్తుంది. ఇవన్నీ ప్రకృతి పరంగా వాతావరణంలో వస్తున్న మార్పులవల్ల సోకుతున్న వ్యాధులు అయితే ఇక కొందరు తమకుతాముగా వ్యాధులను తెచ్చుకొని సమాజంపై వదులుతున్నారు. ఆర్థికంగా, ఆరోగ్యకరంగా ధూమపానం, మద్యపానం, మత్తుపదార్థాల వల్ల జరుగుతున్న అనర్థాలు అన్నీఇన్నీకావు. మద్యపానం, ధూమపానం ఈరెండూ మానవజాతిని పట్టిపీడిస్తున్న భూతాలని చెప్పొచ్చు. ఒకటి బ్రహ్మరాక్షసి అయితే, మరొకటి పిశాచి. మద్యపానాన్ని పెంచిపోషిస్తూ ఆదాయవనరులుగా మలుచుకుంటున్న పాలకులు ధూమపానం విషయంలో ఏదో నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్తున్నారు. కానీ ఆచరణలో చూపించలేకపోతున్నారు. ధూమపానంవల్ల అది తాగేవారే కాదు వారు వదులుతున్న పొగను పీలుస్తున్న చుట్టు పక్కల వారు కూడా అనారోగ్యం పాలవుతున్నారనే విషయాన్ని ధూమపానప్రియులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ప్రపంచవ్యాప్తంగా నూటముప్పై కోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతుంటే భారత్ లో ఇరవై కోట్ల మందికిపైగా పొగాకు అలవాటుపడ్డారు. చుట్టా, బీడీ, సిగరెట్ హుక్కా, రూపురేఖలు, విలాసాల్లో తేడాలే కానీ వాటన్నింటికి మూలం పొగాకే. ప్రపంచ వ్యాప్తంగా అనారోగ్య కారణాల్లో ధూమపానం రెండో స్థానానికి చేరుకున్నది. ఈ సిగరెట్ పొగలో నాలుగువేల ఎనిమిదివందలకుపైగా ప్రమాదకర విషవాయువులు ఉన్నాయని గుర్తించారు. ఇదేకాదు కల్తీ కూడా ప్రజారోగ్యాన్ని కాటేస్తుంది. ఇలాంటివి ఎన్నో ప్రజల అనారోగ్యానికి కారణాలవుతున్నాయి. రోగనిరోధకశక్తి తగ్గిపోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో రోగనిరోధక శక్తి ఎలా పెరుగుతుందో, ఎలా పెంచుకోవాలో పెద్దలు మనసు పెట్టి ఆలోచించాల్సిన తరుణమిది.

సంపద ఉప్పునీరు లాంటిది, ఎంత తాగితే అంత దప్పిక పెరుగుతుంది.



గోల్డ్‌స్మిత్

సవ్య వచనాలు విని ప్రయోజనం లేదు. వాటిని నిత్యకృత్యంలో ఎంతవరకు ఆచరణలోకి తెస్తున్నామనేదే ముఖ్యం.



వివేకానంద

## ప్రజావాక్కు



### పశు సంచారాన్ని కట్టడి చేయాలి

రాత్రిపగలు తేడా లేకుండా పట్టణాలు, నగరాల రహదారులపై తిరుగుతున్న పశువులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకందారులు వాటి ఆలనా పాలనను గాలికొది లేస్తున్నారు. దీంతో అవి రహదారుల వెంటతిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. ప్రధాన రహదారులపై తిష్ట వేయడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. వాహనాలు శబ్దం చేస్తున్నా కదలడం లేదు. వీటివల్లప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. రోడ్డు డివైడర్ల మధ్యలో ఉన్న మొక్కలను సైతం తినేస్తున్నాయి. తోపుడుబండ్లవ్యాపారస్తులు, నడిచివెళ్లే వారు ఇబ్బందిపడుతున్నారు. పురపాలక, నగరపాలక అధికారులు వీటి యజమానులతో మాట్లాడి నియంత్రణకు శాశ్వత చర్యలు తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో సంచరించే వాటిని బందలదొడ్డికి తరలించాలి.

-చల్లాచంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

### శ్రీలంకలోని తెలుగువారిని ఆదుకోవాలి

శ్రీలంకలో ఎక్కువమంది ప్రజలు భారతదేశం నుండి వలస వెళ్లిన వారిలో తెలుగు వారు కూడా ఉన్నారు. తూర్పు శ్రీలంకలోని అంపారాజిల్లాలోని అలైయదివేంబు డివిజన్‌లో అలిక్కంబాయి అటవీ ప్రాంతంలో యాచక వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. రాజురాజ సింహా 2 భారత్ నుండి శ్రీలంకకు వలస వెళ్లినప్పుడు ఆయన వెంట ఈ తెలుగు ప్రజలు కూడా వెళ్లారని కొంతమంది చరిత్రకారులు చెబుతు న్నారు. కొంత మంది వీరు నేరుగా శ్రీలంకకు వెళ్లారని చెబుతున్నారు. మొదట్లో వీరు హిందువులుగా ఉన్నారు. వీరు విద్య,వైద్యం, తాగునీరు, ఇల్లు, రవాణా వంటి సౌకర్యాలు లేక వందల సంవత్సరాల నుంచి జీవిస్తున్నారు. వీరికి నాగరికత ప్రజలతో సంబంధాలు లేకపోవడంతో సింహాళం, తమిళ్ మాట్లాడకుండా కేవలం తెలుగులో మాట్లాడుకుంటారు.

-ఆళవందార్ వేణుమాధవ్, హైదరాబాద్

### ఇడుపుల పాయలో పేదలు లేరా?

రాష్ట్ర రాజధాని అమరావతిని ఏడారి, స్మశానం అని కీర్తించిన పాలకులు ఇక్కడక్కడ భూములు రాష్ట్రంలోని పేద వారందరికీ పంచుతారట! మరి ఇడుపులపాయలో పేదవారికి తమ తాత గారుఆక్రమించిన భూములు తరతరాలుగా అనుభవిస్తున్నారా? ఆ భూముల ముందుఅక్కడి పేదవారికిపంచవచ్చుకదా! అలాగే మూడు రాజధానులుఅంటున్నవారు, విశాఖలో ఆక్రమించుకుంటూ, అమరావతిలో పంచుతారా? మరి కర్నూలు పేదలు అమరావతి వచ్చి ఉంటారా? ఇదెక్కడి చోద్యం?

-తలశిల రాజేంద్రప్రసాద్, కృష్ణాజిల్లా

### కోర్టు ఖర్చులు రాబట్టాలి

చంద్రబాబునాయుడు గారు ప్రతి సంవత్సరం తన, తన కుటుంబ సభ్యుల ఆస్తులను బహిరంగంగా ప్రకటిస్తున్నారు. అయినా ఆయన మీద వ్యక్తిగత కక్షలతో లక్ష్మీపార్వతిగారు ఆయన ఆస్తులపై విచారణ జరపాలని సుప్రీంకోర్టుకు వెళ్లితే పిటిషన్ కొట్టి వేయడమే కాకుండా కోర్టు చీవాట్లు పెట్టడం జరిగింది. ఇలా చంద్రబాబు మీద తుంటరి పిటిషన్లు వేయడం రాజశేఖర్‌రెడ్డి నుంచి మొదలైంది. ఆ తర్వాత ఆయన భార్య వేయడం, ఉపసంహరించుకోవడం. ఈవిధంగా కోర్టుల సమయాన్ని, తద్వారా ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారు. ఆపైన ఆయనేదో స్టే తెచ్చుకున్నాడన్న దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలా దురుద్దేశాలతో వేసిన పిటిషన్లపై కోర్టులు వారి వద్ద నుంచి కోర్టు ఖర్చులు వసూలు చేయాలి.

- కంభంపాటి కోటేశ్వరరావు, విశాఖపట్నం

### దమ్ముచక్రాలతో రహదారులు ధ్వంసం

వర్షాకాలం వచ్చిందంటే గ్రామాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగుతాయి. రైతులు వరినాట్లు వేసే పనిలో బిజీగా ఉంటారు. ఇదే సమయంలో కొందరు ట్రాక్టర్ల యజమానులు దమ్ముచక్రాలతో ట్రాక్టర్లని రహదారులపై నడపడం ద్వారా రోడ్లు బాగా దెబ్బతింటున్నాయి. వర్షాలు,వరదలు, నాణ్యత లేకుండా రోడ్లు వేయడం భారీ వాహనాలు వెళ్లడం తదితర కారణాలతోపాటు, దమ్ముచక్రాలతో ట్రాక్టర్లని నడపడంవల్ల కూడా రహదార్లు దెబ్బతింటున్నాయి. దమ్ముచక్రాలతో రహదార్లపై ట్రాక్టర్ల నడపవద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ, సమాజంలో రైతుల పట్ల సానుకూల ధోరణి ఉండటంతో ప్రభుత్వాలు ఎటువంటి ఆంక్షలను వీరిపై విధించడం లేదు. రోజురోజుకు రవాణా వాహనాలు పెరగడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటువంటి నేపథ్యంలో వివిధ కారణాలతో రహదార్లు మరింత దెబ్బతింటే మరిన్ని రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

-యం.రాంప్రదీప్, తిరువూరు

### పరిశోధనలు జరపాలి

ప్రపంచంలో టెక్నాలజీ పెరిగిపోతుంది. టెక్నాలజీని అన్ని రంగాల్లో అభివృద్ధికి ఉపయోగించుకోవాలి. అందులో భాగంగానే హైడ్రోజన్‌తో నడిచే వాహనాలను, విద్యుత్ బ్యాటరీలతో నడిచే కాలుష్యరహిత వాహనాల తయారీకి కావలసిన పరిశోధనలు జరగాలి. ప్రస్తుతం వాహనాలకుఉపయోగిస్తున్న ఇంధనాల వల్ల కాలుష్యం కారణంగా వాతావరణ అసమానతలు జరిగి విపత్తులుసంభవిస్తున్నాయి. కావునప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇంధనాలను ప్రభుత్వం ప్రత్యామ్నాయ అవసరాలకు ఉపయోగించాలి.

-డి.చాంద్‌బాషా, కర్నూలు

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# ప్రోత్సాహం లేని పాడిపరిశ్రమ

**ఎక్కువ నాణ్యమైన పాలుపోసే మహిళలకు, పురుషులకు ఆదర్శ రైతు అవార్డులతో పాటు నగదు, ప్రశంసాపత్రం ఇవ్వాలి. పాడిరైతు మరణిస్తే వైకుంఠ ధామం ఖర్చుల కింద రూ.పదివేలు ఇవ్వాలి. 1000 లీటర్లు, అంతకన్నా ఎక్కువ పాలుపోసే డెయిరీఫామ్‌లకు గడ్డియంత్రాలు, పాలక్యాన్లు, విద్యుత్తు, దాణా,మినరల్ మిక్చర్, ఇన్సూరెన్స్‌కు సబ్సిడీ ఇచ్చి, పాడి రైతులకు సంక్షేమపథకాలు అమలు చేసేం దుకు రూ.10 కోట్లు నిధి ఏర్పాటు చేసి అంకుర సంస్థలు డెయిరీ ఫామ్‌లకు ప్రోత్సాహకాలు, సిబ్బందికి పిఆర్‌సీ అమలు, పదవీ విరమణ పొందిన వారిస్థానంలో తక్షణమే సిబ్బందిని నియమించి క్షీర విప్లవానికి నాంది పలకాలి.**

ముచ్చుకోట సురేష్‌బాబు

దేశంలో పాడి పరిశ్రమపై కోట్ల మంది ఆధారపడి ఉన్నారు. ఆత్మనిర్భర భారత్ ప్యాకేజీ, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా వారిని ప్రభుత్వాలు ఆదుకునే ప్రయత్నం వృధాగా మిగిలిపోయింది. కరోనా లాక్‌డౌన్ సమయంలో పాలకు భారీగా డిమాండ్ పడిపోయి డెయిరీ కో ఆపరేటివ్ సంస్థల ద్వారా కేవలం 4100 కోట్లు కొనుగోలు చేసి రైతులకు చెల్లించినట్లు కేంద్ర ఆర్థిక శాఖమంత్రి తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా పశువుల ఫీడ్, డెయిరీ ప్రాసెసింగ్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టారు. పేద రైతులకు ఊతమిచ్చే ఒక్క పథకం లేకపోవడం, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా కేవలం గొర్రెలు, పౌల్ట్రీ పరిశ్రమలకు పరిమితం చేయడం వలన పాడి పరిశ్రమకు గడ్డుకాలం దాపురించింది. పాడి పరిశ్రమలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.15వేల కోట్ల యానిమల్ హస్బెండరీ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఫండ్ ఏర్పాటు చేస్తామని ఉత్తర ప్రగల్భాలు పలికారు. ఆచరణలో పాడిరైతులకు ఒనగూరేది శూన్యం. పాడిపరిశ్రమ, ఫిషరీపై ఆధారపడిన వారికి ప్రభుత్వం అండగా నిలవాలి. సన్నకారు రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమ మీద ఆధారపడుతున్నారు. లాక్‌డౌన్ సమయంలో హోటళ్లు వంటివి మూతపడడంతో పాలకు దాదాపు 28శాతంవరకు డిమాండ్ తగ్గిపోయింది. రోజువారీగా 560 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుండగా, 360 లక్షల లీటర్లు మాత్రమే అమ్ముడుపోయేది. పశువైద్యశాలలు అందుబాటులో లేక, సిబ్బంది లేక నిర్వహణ లేక మూతపడ్డాయి. అలాగే పశువుల్లో మూతి, కాలి వ్యాధుల నివారణ, పశువులలో గాలిసోకు వ్యాధి, జెనిగలు, నట్టలు, ఏలిక పాముల నివారణ కోసం నేషనల్ యానిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ కిందనిధులు సమకూర్చుకోవాలి. దేశవ్యాప్తంగా గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పందులకు 100 శాతం వ్యాక్సినేషన్ చేసేందుకు ఈ నిధులు వినియోగించుకొని పాడి పరిశ్రమను గాడిలో పెట్టాలి. పశువులలో గొడ్డుమోతుతనం వలన విపరీతమైన ఆర్థికనష్టం వాటిల్లి భారతదేశంలో పాడి పరిశ్రమ కుంటుపడుతోంది. గొడ్డుపోయిన పశువుల పోషణ ఆర్థికపరంగా భారమవుతుంది. చాలా రాష్ట్రాల్లో ఇలాంటి పశువులను కబేళాలకు తరలిస్తారు. ఒకప్పుడు పంట కలిసిరాకపోతేనేం ఇంటి ఖర్చులకు పాడి ఆదుకుంటుందని ఆశపడేవారు. అష్టకష్టాలు పడి పశువులను పెంచుతున్నారు. ఎంత శ్రమించినా గిట్టుబాటు కాక విలవిల్లాడుతున్నారు. రైతుల కష్టంతో డెయిరీలు లాభాలార్జిస్తున్నాయి. పాల సేకరణ ధరను పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పశుగ్రాసం దొరక్క రైతాంగం అవస్థలు పడుతోంది. డెయిరీలు దాణా ధరనుతరచూ పెంచుతుండడంతో నష్టాల బాటపడుతోంది. దేశంలో పాడి పరిశ్రమకు కష్టకాలం దాపురించింది. పాడిపశువుల ద్వారా వచ్చే ఆదాయం ఏమాత్రం గిట్టుబాటు కావడంలేదు. పెరుగుతున్న దాణా ధరలు, అందుబాటులో లేని పశుగ్రాసంతో అన్నదాతలు పశువుల పెంపకంలో అష్టకష్టాలుపడుతున్నారు. దాణా ధరలు పెంచడంలో డెయిరీలు బహిరంగ మార్కెట్‌తో పోటీపడుతున్నాయి. విజయ డెయిరీతోపాటు హెరిటేజ్, సుప్రజ, శ్రీచక్ర, గాయిత్రి, హట్సాన్, తిరుమల తదితర ప్రైవేట్ డెయిరీల ద్వారా పాలసేకరణ కేంద్రాల్లో పాలకు సరైన ధర లభించడం లేదు. గతంలో మినీ డెయిరీలు, పాడిపశువుల పెంపకంపై అందరు ఆసక్తి చూపించేవారు. నిరుద్యోగులకు పాడి పరిశ్రమ ఉపాధి అవకాశంగా ఉండేది. ప్రస్తుతం పాల డెయిరీలు చెల్లిస్తున్న ధరలతో మినీ డెయిరీలు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదన్న ఆందోళన




వ్యక్తమవుతోంది. ఆయా డెయిరీల ద్వారా ఉత్పత్తి చేస్తున్న పాల పదార్థాల ధరలను ఏడాదికి రెండుమూడు సార్లు పెంచేస్తున్న యాజమాన్యాలు రైతుల నుంచి సేకరిస్తున్న పాలకు ధర పెంచడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. డెయిరీ యాజమాన్యాలు పాలకు గిట్టుబాటు ధరను చెల్లించడం లేదని రైతులు యాజమాన్యాలను కూడా నిలదీస్తున్నారు. పూటకు రెండు లీటర్ల పాలిచ్చే పశువుకు రోజుకు సుమారు మూడు కేజీల దాణా పెట్టాలి. పచ్చగడ్డి లేదంటే అందుబాటులో ఉన్నట్టయితే ఎండుగడ్డిని పెట్టాలి. రోజుకు నాలుగు లీటర్ల పాలకు 8.0 వెన్న శాతం వస్తే లీటరుకు రూ.37వరకు డెయిరీలు చెల్లిస్తున్నాయి. ఈ లెక్కన నాలుగు లీటర్లకు రూ.148 వస్తే దాణాకు సుమారుగా రూ.80ఖర్చవుతున్నది. రైతుకు రోజు కూలీద్వారా వచ్చే ఆదాయం రూ.300 నుంచి రూ. 450లు. దీంతో పాడిపశువులను మేపుతున్న రైతులు రోజుకు రూ. 150నుంచి రూ.200వరకు నష్టపోవలసి వస్తోంది. ప్రస్తుతం దాణా, పశుగ్రాసం కొరత వల్ల వెన్నశాతంకూడా తక్కువగానే ఉంటోంది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పాలసేకరణ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పాలలో వెన్నశాతం ఆరు నుంచి ఎనిమిది శాతం వరకు మాత్రమే ఉంటోంది. పదిశాతం వెన్న ఉన్నట్టయితే డెయిరీలు లీటరు గేదె పాలకు రూ.50చెల్లిస్తున్నాయి. వెన్నశాతం లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూడవలసి వస్తోంది. రాష్ట్రంలో చాలాకుటుంబాలు పాడి పశువుల పెంపకంపై ఆధారపడి జీవించేవి. ప్రభుత్వసహకార డెయిరీల ద్వారా 21.7 లక్షల లీటర్లు అలాగే ప్రయివేటు డెయిరీల ద్వారా రోజుకు 47.5 లక్షల లీటర్ల వరకు పాలసేకరణ జరుగుతోంది. అసంఘటితంగా ఉన్న పాడిరైతులు 220లక్షల లీటర్లు అమ్ముతున్నట్లు తెలుస్తున్నది. ప్రైవేట్ డెయిరీలతోపోటీ ఉన్న గ్రామాల్లో రూ.2 నుంచి రూ.10, ఆవుపాలకు రూ.5 అదనంగా చెల్లిస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్‌లో పెరుగుతున్న దాణా ధరలతో పాడిరైతులు మరింత నష్టపోవలసి వస్తోంది. గత సంవత్సరం నుండి దాణా ధర రూ.200 పెంచేశారు. ఇక మార్కెట్‌లో ఏడాదిక్రితం వరకు రూ.500 ఉన్న తౌడు బస్తా ధర రూ.600కు చేరింది. వరిగడ్డి అందుబాటులో లేకపోవడంతో ట్రాక్టరు ఎండుగడ్డిని రూ.10వేల నుంచిరూ.12వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. పాడిపశువుల కొనుగోలుకు రూ. 20వేలు సబ్సిడీ, పాడిపశువు ఇన్సూరెన్స్‌కు రూ.2000 పశువులకు కృత్రిమ గర్భధారణ సదుపాయం, సబ్సిడీపై నాణ్యమైన దాణా సరఫరా చేసి అధికశాతం నాణ్యత కలిగిన పాలకు ప్రీమియం ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పాడి రైతు కుటుంబంలో పెళ్లి జరిగితే పెళ్లికానుక పేరుతో రూ.పదివేలు, వారి కుటుంబాలలో పదో తరగతిలో 9జిపిఎ సాధించిన విద్యార్థికి విద్యాకానుక పథకం కింద ఐదువేల రూపాయల నగదు, ఎంసెట్‌లో 10వేల కన్నా తక్కువ ర్యాంకు సాధించిన విద్యార్థికి, ప్రభుత్వ వైద్య కళాశాల, ఐఐటీ, జెఈఈలో సీటు సాధించిన విద్యార్థులకు రూ.పదివేల నగదు, అఖిలభారత సర్వీసు ఉద్యోగం సాధించిన వారికి ప్రశంసాపత్రాలు ఇచ్చి ప్రోత్సహించాలి. ఎక్కువ నాణ్యమైన పాలుపోసే మహిళలకు, పురుషులకు ఆదర్శ రైతు అవార్డులతో పాటు నగదు, ప్రశంసాపత్రం ఇవ్వాలి. పాడిరైతు మరణిస్తే వైకుంఠ ధామం ఖర్చుల కింద రూ.పదివేలు ఇవ్వాలి. 1000 లీటర్లు, అంతకన్నా ఎక్కువ పాలుపోసే డెయిరీఫామ్‌లకు గడ్డియంత్రాలు, పాలక్యాన్లు, విద్యుత్తు, దాణా, మినరల్ మిక్చర్, ఇన్సూరెన్స్‌కు సబ్సిడీ ఇచ్చి, పాడి రైతులకు సంక్షేమపథకాలు అమలు చేసేందుకు రూ.10 కోట్లు నిధి ఏర్పాటు చేసి అంకుర సంస్థలు డెయిరీ ఫామ్‌లకు ప్రోత్సాహకాలు, సిబ్బందికి పిఆర్‌సీ అమలు, పదవీ విరమణ పొందిన వారిస్థానంలో తక్షణమే సిబ్బందిని నియమించి క్షీర విప్లవానికి నాంది పలకాలి. ●

# జాతీయోద్యమాన్ని జాగృతం చేసిన హిందీ

కామిడి సతీష్ రెడ్డి

భారతదేశంలో అధిక సంఖ్యలో మాట్లాడే భాష హిందీ. అనేక రాష్ట్రాల్లోని ప్రజలు హిందీ భాషలోనే మాట్లాడుతారు. పలకడానికి సులభంగా, అందరికీ అర్థం అయ్యే భాష హిందీ. అక్షర జ్ఞానము లేని వారు కూడా అనర్గళంగా మాట్లాడే భాష హిందీ. పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు హిందీ నేర్పుతారు. పాఠ్యపుస్తకాలు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి హిందీ నేర్పుతూ ఉన్నారు. హిందీ భాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 14న జరుపుకుంటారు. భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపైనడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహదపడినందున గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని కేంద్రప్రభుత్వ అధికారభాషగా గుర్తిస్తూ పొందుపరిచారు. అప్పటి నుంచి ప్రతి యేటా సెప్టెంబరు 14 రోజున హిందీ భాషా దినోత్సవాన్ని జరుపుకుంటారు. దేవనాగరి లిపిలో రాయబడిన హిందీ భాషను రిపబ్లిక్ ఆఫ్ ఇండియా రెండు అధికారిక భాషలలో ఒకటిగా భారత రాజ్యాంగ సభచే జరుపుకుంటారు. ఈ మేరకు హిందీకి అనుకూలంగా బీహార్ రాజేంద్ర సింహాతో పాటు హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలి శరణ్ గుప్త్, సేథ్ గోవింద్ దాస్‌లు ర్యాలీలు చేశారు. అందుకని, 1949 సెప్టెంబరు 14న బీహార్ రాజేంద్ర సింహా 50వ పుట్టినరోజున, హిందీని అధికారిక భాషగా స్వీకరించిన తర్వాత వారి ప్రయత్నాలు ఫలించాయి. ఈ నిర్ణయం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ఆమోదించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 343 ప్రకారం, దేవనాగరి లిపిలో రాసిన హిందీని అధికారిక భాషగా స్వీకరించారు. మొత్తం మీద, భారతదేశంలో 22 షెడ్యూల్డ్ భాషలున్నాయి. వాటిలో రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించబడతాయి. హిందీ,




ఇంగ్లీష్, ఆధునిక హిందీని నేడు 350 మిలియన్లకుపైగా ప్రజలు మొదటి భాషగా మాట్లాడుతున్నారు. మనదేశంలో కోట్లాది ప్రజల హృదయ స్పందన వినిపించే భాష హిందీ. హిందీ జాతీయ భాషగా రాజభాషగా, అంతర్జాతీయ భాషగా గుర్తించి పొందింది. 200విశ్వవిద్యాయాల్లో హిందీకి సంబంధించి అధ్యయనం, పరిశోధనలు జరుగుతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. బంగ్లాదేశ్, నేపాల్, మారిషస్, ఫిజీ, జపాన్, గయానా, సురినామ్, ట్రినిడాడ్, హాలెండ్, హాంకాంగ్, థాయిలాండ్, సింగపూర్, జాంబియా, హుడాంగా, కెనడా, హాలాండ్, స్విట్జర్లాండ్, హంగేరి, రష్యా, చైనా, ఖతర్, అమెరికా మొదలగు దేశాల్లో హిందీ గుర్తింపు పొందింది. నేడు అన్ని సామాజిక వర్గాల్లో హిందీ ప్రాముఖ్యత పెరుగుతోంది. ఇందులో విశేషంగా భారతీయ సినిమా రంగం పాత్ర కనిపిస్తుంది. నేడు అమెరికాలో, కెనడా, స్విట్జర్లాండ్ మొదలైన దేశాలలో హిందీ తరగతులు నిర్వహిస్తున్నారు. దీని ద్వారా ఎంతో మంది హిందీ నేర్చుకుంటున్నారు. హిందీని శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన శబ్దకోశాలచే సన్నద్ధం చేస్తూ మరోవైపు ప్రసార, ప్రచార రంగాలకు కూడా విస్తరింపచేస్తున్నారు. సాంకేతిక విజ్ఞానంలో వచ్చిన మార్పులతో ప్రతి ఇంట్లో ప్రతి గ్రామంలో శ్రవ్య, దృశ్య సాధనాల ద్వారా హిందీ ప్రచారంలోనూ ప్రగతిలోనూ విశేషమైన ప్రగతి కనిపిస్తుంది. వార్తలు ప్రసారం అవుతూ ఉన్నాయి. హిందీ ఒక సమృద్ధమైన, సంపన్నమైన భాష. దీనికి వ్యాకరణం. లిపి, శబ్దసంపద ఉంది. జనాభా దృష్ట్యా చూస్తే హిందీ మాట్లాడే వారి సంఖ్య ఇంగ్లీష్, చైనీస్ తర్వాత మూడోస్థానంలో ఉంది. ప్రసార మాధ్యమంలో కూడా హిందీ తన సుస్థిరమైన స్థానాన్ని సాధించింది. ఇంటర్నెట్, కంప్యూటర్, మీడియా, ఎలక్ట్రానిక్, మీడియా, సినిమా, అన్నిఛానల్స్ హిందీలో ప్రసారం చేస్తున్నారు. కన్నడ, మలయాళం, తమిళం, ఒరియా, తెలుగు, అస్సామీ, గుజరాతీ, పంజాబీ, మరాఠీ, మణిపురి ఇలా భాష ఏదైనా అందరికీ అర్థమయ్యేదిహిందీ. హిందీ..ఇది కేవలం భాషకాదు. కోట్లాది మంది మాట్లాడే భాష. హిందీలో మాట్లాడుతాం, హిందీ భాషని గౌరవించుదాం. హిందీ భాష గొప్పతనాన్ని చాటుదాం. ●

# మోడీ మధ్యవర్తిత్వం ఫలించేనా?



డా.సంగని మల్లేశ్వర్

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నిరంతరాయంగా కొనసాగిస్తోంది. ఇప్పటికిప్పుడుయుద్ధం ఆపేటట్లు లేదు. రష్యా గెలవలేదు. ఉక్రెయిన్ తలవంచలేదు. ఉక్రెయిన్‌పై ఫిబ్రవరి 24న రష్యా సైనిక చర్య ప్రారంభించింది. బాంబుల మోత వినపడుతూనే ఉంది. ఏడు నెలలుగా యుద్ధం జరుగుతున్న కారణంగా ఉక్రెయిన్ ప్రజలు ఇతర దేశాలకు వలస వెళ్లిపోతున్నారు. ఉక్రెయిన్ మొత్తం జనాభా మూడు కోట్ల 70లక్షలు. ఇందులో 80 లక్షల మంది దేశంవిడిచి వెళ్లిపోతే ఇప్పుడా దేశంలో మిగిలింది మూడు కోట్లలోపుగానే ఉంటుంది. ఉక్రెయిన్‌ను వదిలిపెట్టి వెళ్లిన వారిలో అత్యధికులు మహిళలు, పిల్లలే. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో అతిపెద్ద శరణార్థి సంక్షోభం మొండి దేశాల పుణ్యమే. స్వదేశాన్ని కాపాడుకోవడానికి యుద్ధంలో పాల్గొనాలన్న 18-80 ఏళ్ల వయస్కులైన పురుషులు ఎవ్వరు ఉక్రెయిన్‌ను విడిచిపెట్టి వెళ్లలేదు. గతంతో పోల్చుకుంటే సరిహద్దులు దాటుతున్నవారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ భీకర యుద్ధంలో ఏడువేల మంది పైగా ప్రాణం నష్టం జరిగింది. ఇప్పటికిప్పుడు జరిగిన యుద్ధం కాదు. 2014 లోనే ఉక్రెయిన్‌లోని రష్యా అనుకూల ప్రభుత్వాన్ని కూలదోసేందుకు పాశ్చాత్య రాజకీయ నేతలు భారీ ఎత్తున ప్రజాందోళన చేపట్టినారు. ఆ సందర్భంగా జరిగిన సంఘర్షణలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. దానితో రష్యా అనుకూల ప్రభుత్వం పతనమై, పాశ్చాత్య దేశాలకు వత్తాసు పలికే డమ్మీ ప్రభుత్వం ఏర్పాటు అయింది. రష్యన్ భాషా మాట్లాడే ప్రాంతాలపై దాడులను విస్తృతం చేశారు. అందులో భాగంగానే క్రిమియా రష్యాలో విలీనం కావడానికి దారితీసింది. రక్తసిక్తమైన రష్యా చరిత్రలో, అంతటి మహాసామ్రాజ్యం కుప్పకూలిన ఒక రక్తపుబొట్టు నేలరాలకుండా అధికారం బదలాయింపు జరిగిందంటే అది గోర్బచేవ్ గొప్పదనం. కమ్యూనిజానికి కాలం చెల్లి, సోవియట్ యూనియన్ ఆఖరి సజీవ చిహ్నం కనుమరుగైపోయింది. రష్యా, ఉక్రెయిన్ మధ్య పోరు క్రిమియాతో మొదలైన యుద్ధం క్రిమియాతోనే ముగుస్తుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ బహిరంగంగానే వ్యాఖ్యానించడం గమనార్హం. రష్యాదాడుల్లో ఉక్రెయిన్ ఇప్పటికే కకావికలమైంది. ఇరువైపులా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా జీవన వ్యయం బాగా పెరిగిందని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో వెల్లడించింది. వందేళ్లలో ఇలాంటి సంక్షోభాన్ని చూడలేదని పేర్కొన్నది. దీన్ని తట్టుకొనే సామర్థ్యం ప్రజలకు లేదని ఆందోళన వ్యక్తంచేసింది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచంపై ప్రభావానికి సంబంధించి యూఎన్



విడుదల చేసిన రెండో నివేదిక ఇది. ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచం మీద పెద్ద బండఎత్తేసిందని, ప్రజలు నలిగిపోతున్నారని యూఎన్ నివేదికలో పేర్కొన్నది. పెరుగుతున్న ఆహార, చమురు, ఎరువుల ధరలే ఆ రాయి అని తెలిపింది. ఎఫ్ఏఓ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం 20,8శాతం ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయి. ఫలితంగా రవాణా వ్యయం పెరిగింది. ఎరువుల ధరలు పెరిగాయి. ఆహార ఉత్పత్తి వ్యయం పెరిగింది. జీవన వ్యయం పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విషవలయంలోకి వెళ్తున్నది అని యూఎన్‌పేర్కొన్నది. ఈయుద్ధ వాతావరణంలో రష్యా ఆర్థికంగా చాలా నష్టపోయింది. ఈ నష్టాన్ని భర్తీ చేసుకోవడానికి రష్యా భారత్‌ను ఆశ్రయించింది. రానున్న రోజుల్లో తమ నుంచి చమురును కొనుగోలు చేసి, ఇక్కడ పెట్టుబడులు పెంచాలని ఇండియాను రష్యా కోరింది. రష్యా 30 శాతం తగ్గింపు రేట్లకు ముడి చమురును మన దేశానికి అమ్ముతోంది. చైనా, భారత్ రెండు దేశాలు రష్యా నుంచి చమురు దిగుమతులను భారీగా పెంచాయని రష్యాసెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. మే నెలలో రష్యా నుంచి చైనా చమురు దిగుమతులు 55 శాతం పెరిగినట్లు సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. జూన్ నెలలో మనదేశ చమురు దిగుమతులు 21 శాతం పెరిగిందని, రష్యా ఇచ్చిన బంపర్ ఆఫర్‌వల్ల కరోనాకు ముందు నాటి స్థాయికి చేరుకుంటోందని ప్రభుత్వం వెల్లడించడం ముదావహం. రష్యాతో భారత్‌కు ఉన్న స్నేహం రీత్యా పుతిన్‌తో మాట్లాడి యుద్ధాన్ని ఆపేలా చూడాలని, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన నాటి నుంచి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భారత్ జోక్యం చేసుకోవాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. అయితే భారత్ మాత్రం ఆ విషయంలో తలదూర్చేందుకు పెద్దగా ఇష్టపడలేదు. ఉక్రెయిన్ అంశంలో భారత్ అనుసరిస్తున్న వైఖరి వల్ల ప్రధాని మోడీని జీ7 సదస్సుకు ఆహ్వానించడం లేదని కొన్ని వార్తలు వచ్చాయి. రష్యా నుంచి చమురు కొనుగోలుతోపాటు యూఎన్ ఓటింగ్‌లో ఇండియా తటస్థంగా ఉన్న కారణంగా జర్మనీ ఆ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకూ ఈ విషయంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకొని భారత్, మున్ముందు ఇరు దేశాల మధ్య శాంతి స్థాపనకు కీలక పాత్ర పోషించే అవకాశం ఉన్నదని, రష్యా-ఉక్రెయిన్ శాంతిచర్చల ప్రక్రియలో భారత్ మధ్యవర్తిగా వ్యవహరిస్తుందా? వాస్తవానికి సమస్యకు పరిష్కారం చూపించే పెద్దన్న పాత్రను భారత్ పోషించదలుచుకుంటే అంతర్జాతీయ సమస్యల పట్ల న్యాయమైన, హేతుబద్ధమైన దృక్పథంతో అటువంటి ప్రక్రియకు శ్రీకారం చుట్టాల్సి ఉంది. జీ7 దేశాలను కాదని తోక జాడిస్తే భవిష్యత్‌లో రష్యాతో సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందోనన్న ఆలోచనతో భారత్ ఆచీతూచి అడుగులు వేస్తుంది. జాతీయ ప్రయోజనాలపై దృష్టిపెట్టి ఓ పరిష్కారాన్ని అందించగలిగే భారత్ మధ్యవర్తిత్వం వల్ల సుముఖత వ్యక్తం చేయడం, ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు మధ్యవర్తిగా భారత్ వ్యవహరించవచ్చునని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీలావ్‌రోవ్ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘంగా కొనసాగితే దాని కారణంగా సంక్షోభం పెరిగితే, రైతులు, జవాన్లు, నష్టపోవాల్సి వస్తుంది. రష్యా, ఉక్రెయిన్‌లతో చమురు, ఎరువులు, క్షిపణులు, ఆయుధాలు దిగుమతిలో భారతదేశ వాణిజ్యసంబంధాలు చాలాబలంగా ఉన్నాయి. ఇంతటి ఆధునిక స్వేచ్ఛా యుగంలోనూ యుద్ధాలు ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయనేది జగద్విదీతం. ●

# అక్రమ లే ఔట్ల తొలగింపు



తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా 554 సర్వే నెంబర్‌లో అక్రమ లే ఔట్లను తొలగిస్తున్న దృశ్యం

**కొత్తచెరువు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**

పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పుడా అనుమతులు లేకుండా వేసిన అక్రమ లే ఔట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పుడా వైస్ ఛైర్మన్‌నరేష్ కృష్ణ తెలిపారు. కొత్తచెరువు మండలంలోని ధర్మవరం రహదారిలో పుడా అనుమతులు లేకుండా నాలుగు లే ఔట్లు వేసి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో తాను వాటిని సందర్శించడం జరిగిందని ఆయన తెలియజేశారు. తరుమలదేవరపల్లి పంచాయతీ పొలంలో మైలేపల్లి బిఇడికళాశాల ప్రక్కన సర్వే నెంబర్ 206లో వేసిన అక్రమ లే ఔట్‌ను తన సిబ్బందితో కలసి తొలగించారు. అలాగే కొత్తచెరువు రెవెవన్యూపొలం సర్వే నెంబర్ 376లో 3 ఎకరాలు, కొత్తచెరువు తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా సర్వే నెంబర్ 354లో 3 ఎకరాలు, లక్ష్మి సినిమా థియేటర్ ప్రక్కన సర్వే నెంబర్ 484లో 1.6 ఎకరాలలో ఉన్న అక్రమ లేఔట్‌ను ట్రాక్టర్ సహాయంతో తమ సిబ్బందితో కలసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుడా అనుమతులు లేని ప్లాట్లను ప్రజలు కొనడం వల్ల తీవ్రంగా నష్టపోతారని, కావున ప్రజలు తప్పనిసరిగా పుడా అనుమతులు ఉన్న లే ఔట్లలోనే ప్లాట్లు కొని రక్షణ పొందాలని ఆయన కోరారు. డబుల్ రిజిస్ట్రేషన్ జరగడం, అసైన్డ్ భూముల్లో ప్లాట్లు ఉండడం తదతర వాటి వల్ల ప్రజలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. 2019 ఆగస్టు 31లోపు పాత లే ఔట్లు వేసి ఒక్క ప్లాటైన అమ్మి ఉంటే ఐపిఎల్‌పి స్కీం క్రింద ఇన్‌ప్రిన్సిపుల్ లౌట్ క్రింద 33 అడుగు రోడ్లను ఇచ్చి రెగ్యులరైజ్ చేసుకోవచ్చున్నారు. కావున పుడా అనుమతులు తీసుకొని లే ఔట్లు వేయాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. కాగా పలు లే ఔట్లను సందర్శించిన ఆయన రాజకీయ ఒత్తిళ్ళ కారణంగా కొంత మంది అక్రమ లే ఔట్లను చూసి చూడనట్లు వ్యవహరించారన్న ఆరోపణలు సర్వత్ర వ్యక్తమౌతున్నాయి. ఈ విషయమై పుడా వైస్ ఛైర్మన్ నరేష్‌కృష్ణను వివరణ కోరగా, ఒకే రోజులో అన్ని అక్రమ లే ఔట్లు తొలగించలేము కదా అంటూ సమాధానం ఇవ్వడం గమనార్హం. అయితే ఎన్ని లే ఔట్లను గుర్తించారని ప్రశ్నించగా, నాలుగు అక్రమ లే ఔట్లు మాత్రమే గుర్తించడం జరిగిందని, మిగిలిన వాటిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

## విద్యుత్‌ఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

**- పరిస్థితి విషమం**

**రామగిరి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**

మండలంలోని కుంటిమద్ది గ్రామంలో మంగళవారం సాయంత్రం విద్యుత్‌ఘాతంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు చిత్రా ఓబుళపతి నూతనంగా నిర్మించుకున్న ఇంటికి పెయింట్ వేస్తూ పైభాగంలో రంగులు వేసే సమయంలో అక్కడున్న ఇనుప పైపును పక్కకు జరుపుతుండగా అవి విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో చిత్రా ఓబుళపతిని మెరుగైన వైద్యం కోసం అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

# కియా ఇండియాకి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం

## - జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

**పెనుకొండ, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**



కియాప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్

ప్రభుత్వం నుంచి కియా ఇండియాకి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పెనుకొండ మండలంలోని ఎర్రమంచి వద్ద నున్న కియా ఇండియా కార్ల కంపెనీని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కియా ఇండియాలో ప్రెస్ షాప్, బాడీ షాప్, పెయింట్ షాప్, అసెంబ్లీ తదితర విభాగాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్లాంట్ ప్రాంగణంలో అనుసరించిన వివిధ విధానాలను పరిశీలించారు. జిల్లా కర్మాగారాల, భద్రత చట్టం, అమలు తీరుపై జిల్లా కలెక్టర్ ఛైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహజంచారు. అంతకు ముందు కియా కంపెనీ ప్రతినిధులు కియా ఇండియాలో కంపెనీ సేల్స్ వివరాలు, ఫ్యాక్టరీ నిర్మాణం, ట్రైనింగ్ సెంటర్ల వివరాలు, కియా కంపెనీ తరుపున ఈ ప్రాంతంలో చేస్తున్న సామాజిక కార్యక్రమాలు , కల్పిస్తున్న సదుపాయాలు, వసతులు తదితర వివరాలను జిల్లా కలెక్టర్‌కి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (సిఏఓ), కట్ డంగ్‌లీ, ప్రిన్సిపల్ అడ్వైజర్ డా.సోమశేఖర్‌రెడ్డి, జిల్లా లేబర్ ఆఫీసర్ నారాయణ, జిల్లా పరిశ్రమల జిఎం చాంద్‌బాషా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూడు లక్షల ఎకరాల్లో ఉద్యాన వన పంటల సాగుకు ప్రోత్సాహం

**- అర్హత ఉన్న ప్రతి రైతుకు డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తాం - శ్రీసత్యసాయి జిల్లాలో 75 వేల ఎకరాలకు మంజూరు - మైక్రో ఇరిగేషన్‌కు 1500 కోట్లు నిధులు - ప్రతి రైతన్న వ్యవసాయం చేయాలి - పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి**



డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

**పుట్టపర్తి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో ఉద్యాన వన పంటలకు డ్రిప్ మరియు స్ప్రింక్లర్లు అందజేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి ఆర్‌డిఓ కార్యాలయం నందు డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీసత్యసాయి జిల్లా ప్రాంతంలోని భూములు, ఉద్యాన పంటలకు అనువైనవన్నారు. ఇటువంటి ఈ జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు వేసే లక్ష్యంతో అడుగులేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 30 వేల దరఖాస్తులు రైతుల నుండి రావడం జరిగిందని, మొదటి విడతగా 10 వేల మందికి డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు అయ్యాయన్నారు. 30 వేల హెక్టార్లు, 75 వేల ఎకరాల పండ్లతోటలకు పంపిణీ చేయడం జరుగుతుందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా అర్హత కలిగిన ప్రతి రైతు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి బడ్జెట్‌లో మైక్రో ఇరిగేషన్ కోసం 1500 కోట్లు కేటాయించడం జరిగిందని, రైతు శ్రేయస్సే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ఒకనాడు తీవ్ర వర్షాభావంతో నీటి కోసం ప్రాకులాడడం జరిగిందని, ప్రస్తుతం వరుణ దేవుడు కరుణించి ప్రతి చెరువు నీటితో నిండి జలకల సంతరించుకుందన్నారు. ఇటువంటి తరుణంలో ప్రతి రైతు తప్పకుండా వ్యవసాయం చేయాలన్నారు. రైతే రాజుగా భావించే వైసిపి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటూ రైతుకు ప్రోత్సాహం అందిస్తున్నదన్నారు. 90 శాతం సబ్సిడీతో రైతులకు మైక్రో ఇరిగేషన్ పరికరాలు అందించడం సంతోషదాయకమాన్నరు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ భాగ్యరేఖ, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సుదర్శన్, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి, పుడా ఛైర్మన్ లక్ష్మినరసమ్మ, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, మండల అధ్యక్షుడు ఎ.వి.రమణారెడ్డి, వైసిపి పార్టీకన్వీనర్లు రంగారెడ్డి, వైసిపి పార్టీ కన్వీనర్లు రంగారెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, కౌన్సిలర్లు లక్ష్మినారాయణ రెడ్డి, సాయిగీత, భాస్కర్ రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు ఋషికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాల చోరులు అరెస్టు

**- చోరీలకు గురైన 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం - వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సిఐ సుబ్రమ్మాణ్యం**



వాహనాలను, దొంగలను చూపుతున్న పోలీసులు

**ధర్మవరం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**

ధర్మవరం పట్టణంలో ఇటీవల ద్విచక్ర వాహనాలు చోరీలు అవుతున్నాయి. దీంతో ధర్మవరం వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రత్యేక బృందాలతో మంగళవారం, చోరీలకు గురైన ఏడు ద్విచక్ర వాహనాలను ముగ్గురిని అరెస్టు చేశారు. పాత్రికేయుల సమావేశంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ సుబ్రహ్మణ్యం పలు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాల దొంగలు కూలీ పనులు చేసుకుంటూ జీవనం చేసేవారని, మధ్యము, జూదము వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడి, వారి వ్యసనాలకు, సంపాదన సరిపోనందున, దొంగతనం అనే మార్గం ఎందుచుకున్నారని తెలిపారు. సులభ మార్గాన డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో పథకం ప్రకారం వీరు దొంగతనాలు చేస్తున్నారని, స్పందన ఆసుపత్రి వద్ద తదితర ప్రాంతాలలో దొంగతనాలు ఏడు మోటారు సైకిళ్లను దొంగతనం చేసి వాటిని బెంగుళూరుకు తీసుకుని పోయి అమ్ముకుందామని ఓ ప్రదేశంలో దాచి ఉంచారని తెలిపారు. ఈ బైకుల విలువ 3.84 లక్షలు ఉంటుదని తెలిపారు. పట్టణంలోని ఎన్‌ఎస్ గేటు రోడ్డు, ఎల్సికేపురం, గోడౌన్ ముందర సిబ్బందితో దొంగలను పట్టుకోవడం జరిగిందన్నారు. పట్టణములోని ప్రియాంక నగర్‌కు చెందిన చీమల రామగోపాల్, ఇందిరమ్మ కాలనీకి చెందిన మందల సుధాకర్, కళ్యాణదుర్గం మండలం దురదగుంట గ్రామంకు చెందిన పాలేటి తిమ్మారెడ్డిలను సిబ్బందితో కలసి వెళ్లి అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు పంపడం జరిగిందన్నారు. అనంతరం డిఎస్పీ రమాకాంత్ సిఐ సుబ్రహ్మణ్యమును, సిబ్బంది శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్, అప్పస్వామి, వెంకటేష్, రాజన్న, ఉమాశంకర్, నరసింహులు అభినందించారు.

# జనరంజక పాలన ఇది

**- ఇచ్చిన హామీలకు మించి సంక్షేమ ఫలం - ప్రభుత్వ పథకం అందని అర్హులుంటే చెప్పండి- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**



పుట్టపర్తి గోకులం బిల్డర్ అహ్మద్ ఇంట ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

జనం యొక్క పాలన ఇది అని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అభివర్ణించారు. మంగళవారం శ్రీసత్యసాయి జిఆల్ల కేంద్రం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని గోకులం కరణం సుబ్బమ్మ నగర్ ప్రాంతలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి తలుపుతట్టి ప్రతి ఒక్కరినీ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ పర్యటించారు. ప్రభుత్వ పథకాలు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అందించిన వివరాలతో కూడిన ప్రతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనరంగక పాలన ఇదే అన్నారు. ఇచ్చిన హామీలనే కాక ఇవ్వని హామీలను కూడా నేరవేరుస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పాలన దేశంలో మరెక్కడా లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 95 శాతం పైగా నెరవేర్చిన ఏకైక నాయకుడు జగనన్న అని, అర్హత కలిగిన ఏ వ్యక్తికి, ఏ కుటుంబానికైనా ప్రభుత్వ పథకం అందకుంటే బాహాటంగా వ్యక్తం చేయమన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం అభివృద్ధి అందేలా చూడడమే తమ ధ్యేయమన్నారు. భగవాన్ సత్యసాయి బాబా అవతరించిన ఈ పుణ్యభూమిని శ్రీసత్యసాయి జిల్లాగా ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాబా భక్తుల కోరకను తీర్చారన్నారు. శ్రీసత్యసాయి జిఆల్లను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడం తమ ధ్యేయం అన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా బాబా అనుగ్రహంతోనే తాను గెలవగలిగానని, ముఖ్యంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులు కృష్ణజలాలతో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశామలం చేయడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే ఆ పథకం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 856 కోట్లు నిధులు మంజూరు చేసేందుకు ఆమోదం తెలిపారన్నారు. బెంగుళూరు సమీపంలో పుట్టపర్తి కేంద్రంగా ఐటి హబ్‌గా రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వేలాది మంది యువతకు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు గట్టిగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, శ్రీసత్యసాయి జిల్లాను కరువు నుండి గట్టెక్కించి శాశ్వత కరువు నివారణ జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ ప్రాంత ప్రజలు గత పరిస్థితులను ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి జగన్మోహణ్ రెడ్డి తమను గుర్తుంచుకొని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సంక్షేమ ఫలాలను వివరిస్తూ చిరు వ్యాపారస్తులు అన్ని వర్గాల ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు.

### బిల్డర్ అహ్మద్ ఇంట భావోద్వేగం

పుట్టపర్తి గోకులానికి చెందిన బిల్డర్ అహ్మద్ ఇంటికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వెళ్ళడం జరిగింది. అక్కడ వారి కుటుంబ సభ్యులు దివంగత వైఎస్.రాజశేఖర్ రెడ్డిని, ఆయనపై ఉన్న అబిమానాన్ని భావోద్వేగంతో ఎమ్మెల్యేకు తెలియజేసుకున్నారు. హెలికాప్టర్ ప్రమాదంలో మహానేత దివంగత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి మృతి చెందిన ఘటన సందర్భంగా అహమ్మద్ కుటుంబ సభ్యులు కొన్ని రోజులపాటు అన్నపానీయాలుమాని బాధతప్ప హృదయులుగా గడిపిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. అహ్మద్ మాతృమూర్తిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆప్యాయంగా పలుకరించి అక్కున చేర్చుకున్నాడు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాయి ఈశ్వరి, నాయకులు రామకృష్ణ, కవిత, నారపరెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, భాస్కర్ రెడ్డి, మాధవరెడ్డి, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి శ్రీదేవి మృతిపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి



చిన్నారి శ్రీదేవి తల్లిదండ్రులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

**పుట్టపర్తి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**


చిన్నారి శ్రీదేవి ఆకస్మికంగా మృతి పై పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండల పరిధిలోని వెంగళమ్మచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్ళి తిరుగుప్రయాణంలో బస్సు ఎక్కి గుండెపోటుకు గురైన ఓ చిన్నారి దుర్ఘటన ఇది. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి గ్రామానికి చెందిన అనిత, శంకర్ దంపతుల కుమార్తె శ్రీదేవి(11) సోమవారం సాయంత్రం పాఠశాల ముగించుకొని ఆర్‌టిసి బస్సు ఎక్కింది. ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుకు గురై మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మంగళవారం ఉదయం అక్కడకు వెళ్ళి చిన్నారి పార్థివ దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇంత చిన్న వయస్సులోనే మృత్యువు కబలించడం జీర్ణించుకోలేని విషయమన్నారు. కొంత ఆర్థిక సహాయం వారికి అందజేసి ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకుంటామని వారిని ఓదార్చారు. అదే విధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పుట్టపర్తికి చెందిన వెంకటేష్ (36) కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. అక్కడికి వెళ్ళి వెంకటేష్‌కు నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి కొంత సాయం అందించి ధైర్యం చెప్పాడు. పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## టపాసుల విక్రయలైసెన్స్‌ల కొరకు దరఖాస్తు చేసుకోండి

**పుట్టపర్తిరూరల్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**

జిల్లాలో అక్టోబర్ 24వ తేదిన నిర్వహించే దీపావళి పండుగను పురస్కరించుకొని టపాసుల విక్రయం కొరకు లైసెన్స్‌లు పొందే వారి కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఆర్‌ఓ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారుడు ఫారం ఎఇ 5లో దరఖాస్తు చేసుకోవాలని డిఆర్‌ఓ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారుడు ఫారం ఎఇ 5ను www.pesa.gov.in వెబ్‌సైట్ నందు లబిస్తుందన్నారు. దరఖాస్తుతో పాటు ఏదైనా నివాస ధృవీకరణ పత్రం, 5 పాస్‌పోర్టు సైజు ఫోటోలు, రూ.500ల చలానాను https://cfms.ap.gov.in వెబ్‌సైట్‌లో హెడ్ ఆఫ్ అకౌంట్స్‌కు జమ చేయవలసి ఉంటుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మూడు సెట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం, మెజిస్ట్రేరియల్ సెక్షన్‌లో ఈ నెల 12వ తేది నుండి ఈ నెల 29వ తేదిలోపు కార్యాలయపు పనిదినములలో ఉదయం 10:30 నుండి సాయంత్రం 05:00 గంటలలోపు అందజేయవచ్చని, రెవెన్యూ, పోలీస్ అదికారుల విచారణ అనంతరం అర్హతను బట్టి జిఎస్‌టి మరియు ఫైర్ చలాన్, ఎన్‌ఓసి సమర్పించిన వారికి మాత్రమే లైసెన్స్‌లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత సంవత్సరానికి దరఖాస్తు చేసుకొని లైసెన్స్‌లు పొందిన వారు మాత్రమే టపాకాయల విక్రయానికి అర్హులని, గతంలో పొందిన లైసెన్స్‌లు చెల్లుబాటు కావన్నారు. గడువు ముగిసిన తరువాత ఎటువంటి దరఖాస్తులు స్వీకరించబడని, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు లైసెన్స్ దారులు కేవలం గ్రీన్ క్రాకర్స్ మాత్రమే అమ్మాలని ఆయన సూచించారు.

## సచివాల ఉద్యోగస్థులు సమయ పాలన పాటించాలి-ఎంపిడిఓ



వర్మికాంపోస్టు ఎరువులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ తేజోత్స్న

**బుక్కరాయనసముద్రం సెప్టెంబర్ 13 ప్రబాతవార్త** : గ్రామ సచివాలయం ఉద్యోగస్థులు సమయ పాలన పాటించాలని ఎంపిడిఓ తేజోత్స్న అన్నారు. మంగళవారం బుక్కరాయనసముద్రం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం, సిద్దరాంపురం గ్రామంలోని ఎస్ డబ్ల్యూ పీసీ కేంద్రన్ని పరిశీలించారు. ఈ తనిఖిలో సచివాలయం సిబ్బంది హాజర్ పట్టిక రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లడుతుసచివాలయం సిబ్బంది నిర్దేశించిన సమయంలో హాజరు వేయాలన్నారు. క్యాంపుకు వెళ్లేటపుడు మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేసి వెళ్ళాలన్నారు. గ్రామ సచివాలయం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వర పరిష్కారం చేయాలని సంబందిత సిబ్బందికి ఆదేశించారు. ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రాల యందు చెత్తను సక్రమంగా విభజించి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్మికాంపోస్టు తయారుచేసుకొని వాటిని అమ్మడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చన్నారు. పర్యావరణహిత మైన ఎటువంటి దృశ్యనా మాలు లేకుండ మంచి పంటలు పండించడానికి ఉపయోగపడుతుందన్నారు. దీనిని ఉత్పత్తి చేయడం ఉపయోగి ంచడం బాగా చేపట్టాలన్నారు. రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ దామో దరమ్మ, సచివాలయం సిబ్బంది తదితిరులు పాల్గొన్నారు.

## సిపిఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 13 ప్రబాతవార్త** : సిపిఐ 24వ జాతీయ మహాసభలను జయప్రదంచేయాలని సిపిఐ మండల కార్యదర్శి మర్రిస్వామి ఆధ్వర్యంలో మంగళవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో మహాసభ పోస్టర్‌ను విడుదలచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా సిపిఐ శింగనమల నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామి, రైతుసంఘం నాయకులు రామక్రిష్ణ, మండల కార్యవర్గ సభ్యులు వెంకట్, శ్రీనివాస్‌రావు, తిప్పేస్వామి, హరిక్రిష్ణ, మునీర్, సుబహాన్, ఏవైఎఫ్ ఆనంద్, రామాంజినేయులు, మహిళా సమైఖ్య మండల కార్యదర్శి నాగమణి, లక్ష్మిదేవి పాల్గొని జాతీయ మహాసభ పోస్టర్‌ను విడుదలచేశారు.

# నెమలివరంలో ఇంటింటికీ మలాథిన్ స్ప్రేయింగ్



స్ప్రేయింగ్ చేస్తున్న హెల్త్, పంచాయితీ సిబ్బంది

**కనగానపల్లి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**

మండల పరిధిలోని నెమలివరం గ్రామంలో ఆరోగ్య సిబ్బంది పంచాయితీ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో ఇంటింటికీ మలాథిన్ ద్రావణాన్ని స్ప్రేయింగ్ చేయించారు. అనంతరం వైద్యసిబ్బంది మాట్లాడు తూ.. నీటి తొట్టెలలో నీరు ఎక్కువ రోజులు నిల్వ చేయరాదని టైర్లు నీళ్ల నిలవకుండా అలాగే ఇంటికి చుట్టు మురికి గుంటలు లేకుండా చూసుకోవా లని ఇలా చేయడం వల్ల దోమలు వృద్ధి చెందవని తద్వారా ఆరోగ్యం పదిలం గా ఉంటుందని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, మునిలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి రఘురా మిరెడ్డి, ఏఎన్ఎం మమత, హెల్పర్ మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

# చెత్తకేంద్రాన్ని పరిశీలించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్



చెత్త కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మధులత

**కనగానపల్లి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని చెత్తతయారీ కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపిసి) మంగళవారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కురుబ మధులత పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ లక్ష్మినారాయణను చెత్త నుంచి ఉపయోగాలపై అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో ప్రజలకు ఏ విధంగా సేవలు అందిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పి హైస్కూల్ ఆమె పరిశీలించారు. హై స్కూల్ హెడ్మాస్టర్ లక్ష్మిదేవిని పిల్లల హాజరు మధ్యాహ్నం భోజనం రోజు వారి మెనూ తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఎస్.వి.రమణ, సచివాలయ సిబ్బంది, బాబు, బాబావలి, ఉపాధ్యాయులు నాగన్న, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

04ATP27.qxd:04ATP27.qxd 14/09/22 10:27 PM Page 1



## లేపాక్షి నాలెడ్జ్ భూములపై అఖిల పక్ష సమావేశం

**- శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారధి**



పెనుకొండ, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల వివాదంపైన ఈ నెల 15వ తేదిన సాయిరామ్ మందిరం, హిందూపురం పట్టణంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బి.కె.పార్థసారధి తెలిపారు. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, రైతు సంఘాల నాయకులు, భూములు కోల్పోయిన రైతులు, కళాకారులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యచరణ ప్రణాళికపై చర్చ ఉంటుందని ఆయన తెలిపారు.

## ధ్వంసమైన కల్వర్టులు సిద్ధమయ్యేది ఎప్పుడు

**-20 రోజులుగా మండల కేంద్రానికి, గ్రామాలకు తెగిన సంబంధాలు**



మధూడి కల్వర్టు వర్షపు నీటి ధాటికి ధ్వంసమైన దృశ్యం

అగళి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : మండలంలో గత 20 రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి సువర్ణముఖి నది ఉధృతంగా ప్రవహించింది. అగళి చెరువు మరువ, మధూడి చెరువుల మరువ కూడా పారింది. సువర్ణముఖి నది ప్రవాహం అధికమవ్వడంతో మధూడి, ఇనగలూరులకు రాకపోకలు నిర్వహించే సువర్ణముఖినదికి అడ్డంగా నిర్మించిన కల్వర్టు పూర్తిగా ధ్వంసమ వడంతో 20 రోజులుగా ఇనగలూరు, తొనసనపల్లి, అల్లికెర, కరిదాసనపల్లి తదితర గ్రామాలకు మండల కేంద్రానికి సంబంధాలు తెగిపోయాయి. అదే విధంగా కొమరేపల్లి వద్ద నిర్మించిన కల్వర్టు కూడా ఈ వర్షపు నీటి ధాటికి ధ్వంసమైంది. అక్కడ కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక అగళి,ఉల్లెకెర, ఇరిగేపల్లి, నందరాజనపల్లికి కూడా సంబంధాలు తెగిపోయాయి. సువర్ణముఖి నదికి అడ్డంగా అగళి చెరువు వద్ద నిర్మించిన కల్వర్టు ఆ నటి ప్రవాహం ఉధృతికి ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా అగళి, రామాపురం, మధ్య నిర్మించిన కల్వర్టు అగళిచెరువు మరువకు పాడైపోయింది. రాగేనింగనపల్లి, బొమ్మాసనపల్లి, రామాపురం కొత్త కాలనీకి కల్వర్టు పాడవడంతో సంబంధాలు తెగిపోయాయి. మొత్తం మండలంలో నాలుగైదు కల్వర్టులు వర్షపు నీటి ధాటికి ధ్వంసం కావడంతో రవాణా సౌకర్యం పూర్తిగా తెగిపోయింది. ఆయా గ్రామాల్లో వృద్ధులు, గర్భిణీలు వికలాంగులు వైద్యం వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. కేవలం ద్విచక్ర వాహనాలు కూడా ఇక్కడ తిరగడానికి ఆస్కారం లేని పరిస్థితి. ఇంత పెద్ద ఎత్తున కల్వర్టులు ధ్వంసమవడంతో ప్రయాణికులు, గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కావున సంబంధిత ఆర్అండ్‌బి పంచాయితీరాజ్ అధికారులు చొరవ తీసుకుని శరవేగంగా కల్వర్టులను నూతనంగా నిర్మిస్తే రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని మండల ప్రజలు కోరుతున్నారు.

## గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై వినతి




వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అగళి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : మండలంలో 13 పంచాయితీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబానిడర్ల తమ సమస్యలు పరిష్కరించాలని ఈఓఆర్డి పద్మకు వినతిపత్రం సమర్పించారు. గ్రీన్ అంబాసిడర్లు గ్రామ పంచాయితీల స్వచ్ఛభారత్ గ్రీన్ అంబాసిడర్ల సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ వీరి సమస్యలను ఈఓఆర్డి దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని నెలలుగా గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు అందడం లేదని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారు చెత్తను తొలగించడానికి సైకిళ్లను అందించడంతోపాటు ట్రాక్టర్లను కూడా అందివ్వాలని ఆ సంఘం నాయకులు గ్రీన్ అంబాసిడర్ల తరుపున వినతిపత్రం సిద్ధం చేసి ఇఓఆర్డికి అందజేయగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాని హామీ ఇచ్చారు.

## ఈ నెల 23న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి

**- సిఐటియు నాయకులు పలుపు**



కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

రామగిరి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : ఈ నెల 23న పుట్టపర్తిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన రామగిరిలో బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను సిఐటియు నాయకులు విడుదల చేశారు. దేశ భక్తి ముసుగులో ప్రజల మధ్యమత చిచ్చులు పెట్టి పబ్బంగడుపుతున్నాట్లు బిజెపి కుట్రలను తిప్పికొడదామన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీ అమలులలో రాష్ట్రాన్ని దగా చేసిన మోదీ సర్కారును నిలదీయడానికి అందరూ సిద్ధం కావాలన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్ ఈ సబకు ముఖ్య అతిథిగా హాజరవతారన్నారు. ఈ సభకు ప్రజలు తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## సాగులో ఉన్న రైతులకు భూ పంపిణీలో ప్రాధన్యత కల్పిస్తాం

రామగిరి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

ప్రభుత్వం చేపట్టిన భూ పంపిణీ కార్యక్రమంలో సాగులో ఉన్న రైతులకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని తహాశీల్దారు నారాయణస్వామి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 1వ తేది నుంచి 6వ తేది వరకు గ్రామాలలో తిరిగి గ్రామ సభలు నిర్వహించామన్నారు. అక్కడ భూ పంపిణీ కోసం అర్జీలు ఇచ్చిన రైతుల అర్హతను బట్టి జాబితాలో చోటు కల్పించడం జరుగుతుందన్నారు. ఎవరైనా రైతుల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడినా ఇబ్బందులకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

## వైసీపీ దురాగతంపై శ్రీరామ్ కన్నెర్ర

తాడిమర్రి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త



ధ్వంసం చేయబడిన బోరు పాయింట్‌ను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్



బాధితుడు కృష్ణను పరామర్శిస్తున్న శ్రీరామ్

మండలంలోని అగ్రహారం నవీపంలోని తెలుగు దేశం పార్టీ సానుభూతి పరుడు గిరిజన కిష్టయ్య వ్యవసాయ భూమిలో జరిగిన సంఘటన స్థలాన్ని ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం తంబాపురం గ్రామంలోని గిరిజన కిష్టయ్య పొలంలో వైకాపా నాయకులు జరిపిన దాడిని శ్రీరామ్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన రైతును పరామర్శించి సంఘటనపై ఆరా తీశారు. బాదుడేబాదుడు కార్యక్రమంలో తాను పాల్గొన్నానని అసూయతో తమ పొలం పక్కలోని తంబాపురం సర్పంచు జయచంద్రారెడ్డి, వీరారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డిలు ఈ చర్యకు పాల్పడ్డాడని వివరించారు. పొలంలో పండిన పంటలు, అభివృద్ధిని ఓర్వలేక సర్పంచు ఈ దురాగతానికి పాల్పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనే తమ పొలానికి ఉన్న కరెంటు సర్వీసును తొలగించాడని హైకోర్టును ఆశ్రయించగా తమకు కోర్టు ఆదేశాల మేరకు సర్వీసును పునరుద్దరించాలని విద్యుత్ అధికారులు ముందుకొచ్చారన్నారు. కానీ సర్పంచు అసూయతో ఆదివారం రాత్రి దౌర్జన్యంగా బోరు పాయింట్ పీకేయించి, స్టార్టర్లు, మోటార్లను ధ్వంసం చేయించారన్నారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ధర్మవరం ఎమ్మెల్యే వెంటనే చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాడిమర్రి, బత్తలపల్లి మండల కన్వీనర్లు గోనుగుంట్ల నారాయణరెడ్డి, కూచి రాము, సుబ్బరాయుడు, సురేంద్ర, బోయపాటి రాము, శ్రీనివాసులు, నెట్టెం రమణ, రంగానాయుడు, కేశవ, దేరంగులప్రతాప్, మోహన్, హరి, విజయ్, సాంబ, వీర తదితరులు పాల్గొన్నారు. రైతు కుటుంబానికి శ్రీరామ్ భరోసా కల్పించి తమ పార్టీ అండగా ఉంటుందని కృష్ణయ్యకు భరోసా కల్పంచారు.

## వడ్డెర కులస్తుల వృత్తులకు ఆటంకం కలిగిస్తే ఉద్యమబాట పడతాం- దేవళ్ల మురళీ

గుడిబండ, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త



తహాశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

గుడిబండ మండల పరిధిలోని కెజియన్ పాళ్యం గ్రామంలో పునాది రాళ్లు కొట్టకూడదు అంటూ గత మూడు రోజుల క్రితం కెజియన్ పాళ్యం గ్రామస్తులకు సంబంధించిన మూడు ఎయిర్ కంప్రెసర్ వాహనాలను భూ గర్భ గనుల శాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ సంఘటన రాష్ట్ర వడ్డెర సంఘం మాజీ చైర్మన్ దేవల్ల మురళీ తప్పు పట్టారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. తరతరాలుగా పునాదిరాళ్లు కొట్టుకుంటూ వడ్డెర కులస్తులు జీవనోపాధి పొందుతున్నారని ఈ క్రమంలో అధికారులు వారి జీవనోపాధికి ఆటంకం కలిగించడం ఎంత వరకు సమంజసం అని నిలదీశారు. చుట్టుపక్కల గ్రానైట్ అక్రమంగా అధికారులతో వెళ్లి కోట్ల కోట్లు సంపాదిస్తున్న పట్టించుకోని అధికారులు ఎలాంటి మందు పాత్రలు గానీ పేలుడు పదార్థాలు కానీ వినియోగించకుండా ప్రకృతికి హాని కలిగించకుండా పునాది రాళ్లు కొట్టుకుంటూ దాదాపు 60 కుటుంబాలు జీవనోపాధి పొందే నిరుపేదలకు ఆటంకం కలిగించడం అధికారులకు తగదని ఎలాంటి ముందస్తు సమాచారం అందించకుండా ఈ విధంగా ఇబ్బందులకు గురి చేస్తూ జీవనోపాధికి ఆటంకం కలిగించడం సమంజసం కాదని తహాశీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర మాజీ చైర్మన్ దేవళ్ల మురళీ, ఉమ్మడి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు దళవాయి వెంకటనారాయణ, సిమెంట్ పోలన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందప్ప, మండల నాయకులు ఎల్ఎల్‌బి నాగరాజు, రాజశేఖర్, వెంకటేష్, భీమ్‌రాజు, నాగరాజు, శ్రీనివాస్, సన్నహనుమప్ప తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొడాలి నానిపై టిడిపి మహిళా నేతలు ఫైర్

**- విమర్శలు మానుకో.. లేకుంటే తరిమితరిమి చీపర్లతో కొడతాం**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు మహిళా నాయకురాళ్లు

సోమందేవల్లి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : రాష్ట్ర మాజీ మంత్రి, ప్రస్తుత గుడివాడ శాసన సభ్యులు కొడాలి నానిపై సోమందేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో మహిళా నేతలు ఫైర్ అయ్యారు. రాష్ట్ర తెలుగు నాడి అంగన్‌వాడీ ఉపాధ్యక్షురాలు నాగమణి నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ ఆధ్వర్యంలో తీవ్రమైన పరుష పదజాలంతో నానిపై వారు విరుచుకు పడ్డారు. ఇటీవల టీడీపీ నేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్, వారి కుటుంబ సభ్యులపై కొడాలి నాని వినడానికి సభ్యతలేని విపరీతమైన అసభ్య పదజాలంతో దూషించిన సంఘటనపై హెచ్చరికలు జారీ చేశారు. రాజకీయ బిక్ష పెట్టిన టీడీపీ పార్టీకి వెన్నుపోటు పొడిచింది కొడాలి అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని చంద్రబాబు కుటుంబంపై విమర్శలు చేస్తే భవిష్యత్తులో ఊరుకోమన్నారు. మహిళా నేతల సహకాన్ని పరిక్షించకూడదని గుడివాడ నడిబొడ్డులో చెప్పులు, చీపుర్లతో ఈడ్చి ఈడ్చి కొడతామని హెచ్చరించారు. అదే విధంగా టీడీపీ పార్టీని అదేపనిగా విమర్శిస్తే 2024 ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చేది టీడీపీ అని రాష్ట్రంలోనే కాదు దేశ సరిహద్దుల్లో కూడా తరిమి కొడతామని హెచ్చరించారు. ముఖ్యంగా ఆడవారిపై అసభ్య పదజాలంతో మాట్లాడటం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు సుజాతమ్మ, ప్రధాన కార్యదర్శి శారదమ్మ, గోరంట్ల మండల ఉపాధ్యక్షురాలు నాగమణి, గ్రామ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మి, మహిళా కమిటీ సభ్యులు భారతమ్మ, రామాంజినమ్మ, మరికొందరు ఉన్నారు.

## రైతులకు బండి బాటను ఏర్పాటు చేయండి

అగళి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

మండల పరిధిలోని మధూడి-కెంకర చెరువు కింద భూములు సాగు చేస్తున్న రైతులకు ఎలాంటి బండిబాట ఇతరాత్ర రవాణా సౌకర్యాలు లేక పోవడంతో ఆ చెరువు కట్ట కింద భూములు సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడ బండి బాటను ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచు జిల్లా రైతు సంఘం కార్యవర్గ సభ్యులు కళ్లప్ప కోరారు. రైతుల ఇబ్బందులను, కష్టాలను దృష్టిలో ఉంచుకుని వారికి బండి బాటను ఏర్పాటు చేయాలని ఆ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహాశీల్దారు జీలానికి అందజేశారు.

## లేపాక్షి నాలెడ్జ్ హబ్ ఒక బూటకపు డ్రామా

**-అన్ని పార్టీలను కలుపుకుని పోరాడుతాం**

**-సిపిఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి మేమయ్యయాదవ్**




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి

లేపాక్షి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

2004లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరిట 8844 ఎకరాలకుపైగా చౌకధరకే బడుగు బలహీన వర్గాల ప్రజల నుండి అభివృద్ధి పేరుతో భూములు దోచుకోవడం జరిగిందని, బ్యాంకుల నుండి 4500 కోట్లు అప్పు చేసి నేడు దివాలా పేరుతో మరోసారి మోసం చేశారని లేపాక్షి నాలెడ్జ్ హబ్ ఓ బూటకపు డ్రామా అని సత్యసాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి మేమయ్యయాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భూముల కుంభకోణంలో ఈడి అటాచ్‌మెంట్‌లో వున్నప్పటికి 15 వేల కోట్ల విలువ చేసే ఈ భూములను నేడు 500 కోట్లకు ఎలా కొనుగోలు చేశారో చెప్పాలన్నారు. 2013 భూ చట్ట ప్రకారం అభివృద్ధి లేని ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ ఆ భూముల్లో కొంత మంది రైతులకు నష్టపరిహారం అందలేదన్నారు. ఆ భూములు కూడా లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరిట వున్నాయని అలాంటి రైతుల పట్ల న్యాయ పోరాటం చేస్తామన్నారు. భవిష్యత్తులో ఈ భూముల్లో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టి కోట్ల రూపాయలు దోచుకోవడానికి మరో కుట్ర చేశారనే సమాచారం వుందన్నారు. ఇంత వరకు ఈ భూ కుంభకోణంలో ఎందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నోరు విప్పలేదన్నారు. కోట్ల రూపాయల కుంభకోణంపై విచారణకు ఆదేశించలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలతో కలుపుకుని భూ పోరాటం చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా పోరాడుతామన్నారు. ఈ నెల 15వతేదీన లేపాక్షి నాలెడ్జ్ హబ్ కార్యాలయం ఆవరణలో సిపిఐ ఆధ్వర్యంలో మరో భూ పోరాటానికి అంకురార్పణ చేసి రిలే నిరసనలు చేపడతామన్నారు. ఈ పోరాటానికి పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల, చిలమత్తూరు మండలాల్లో భూములు పోగొట్టుకున్న రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, కర్షకులు తమ బాధ్యతగా పోరాటం చేయాలన్నారు. ఈ భూములను రైతులకు అప్పగించే వరకు ఈ పోరాటం ఆగదని ఆయన తెలియచేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బయన్న, ఎపిఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, దాదాపీర్, శ్రీరాములు, కుళ్లాయప్ప, శివప్ప, గోవిందురెడ్డి, ఆంజనేయులు, నారాయణస్వామి, జయచంద్రారెడ్డి, బాలచంద్ర, చలపతి, నరసింహామూర్తి, శ్రీనివాసులు, గౌతమ్‌కుమార్, నారాయణరెడ్డి, మారయ్య, మనోజ్, సంతోష్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

**-ఎంఎల్‌సి షేక్‌మహమ్మద్‌ఇక్బాల్**



పథకాల గురించి వివరిస్తున్న ఎంఎల్‌సి

లేపాక్షి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంఎల్‌సి షేక్‌మహమ్మద్‌ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మానేపల్లి బిసికాలనీ, వెంకటాపురం గ్రామాల్లో మండల కన్వీనర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ పెళ్లికానుక పథకం మొత్తాన్ని పెంచారని గత ప్రభుత్వం కంటే తమ ప్రభుత్వం అధికంగా మంజూరు చేసి అక్టోబర్ 1 నుండి అమలు చేయడంపై ఎంతో ఆనందంగా వుందన్నారు. దీంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఆదాయం లేకున్నా ఉన్న వనరులతో సామాన్యులను అదుకునే ఆలోచన జగనన్నకే సాధ్యమని ఆయన కొనియాడారు. పేదలకు పథకాలు అందించడంలో ఆయనకు ఎవరూ సాటిలేరన్నారు. నిరుపేద విద్యార్థులకు వాటిని అందుబాటులోకి తెచ్చిన ఘనత సిఎం జగన్‌కే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు నిర్మలమ్మ, ఎంపిటిసి గంగమ్మ, జెడ్‌పిటిసి బాణాల శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపిపిలు అంజనరెడ్డి, సీనియర్ నాయకులు గోపికృష్ణ, సర్పంచులు ఆదినారాయణ, మాజీ సర్పంచు ప్రభాకర్‌గౌడ్, నాయకులు శంకరప్ప, వేణుగోపాల్‌రెడ్డి, సంజీవ రాయప్ప, వెంకటాచలపతి, నాగరాజు, సర్పంచులు కోడిపల్లి మంజునాథ్, ఎంపిటిసిలు బోర్ల అంజనరెడ్డి, జెకె ప్రభాకర్, చలపతి, సిరివరం మంజు నాథ్, పార్టీ సీనియర్ నాయకులు నాగేపల్లి శంకర్‌రెడ్డి, బిసరమానేపల్లి ప్రసాద్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, గలిబిపల్లి ఈడిగ శ్రీనివాసులు, మంజునాథ్, సిరివరం బాలు, తిప్పన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేపాక్షిలో ఎస్‌ఎఫ్‌ఐ నూతన మండల కమిటీ ఏర్పాటు




నూతనంగా ఎంపికైన ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ

లేపాక్షి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : మండల కేంద్రమైన లేపాక్షిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి ఆధ్వర్యంలో మంగళవారం 17 మందితో ఎస్‌ఎఫ్‌ఐ నూతన మండల కమిటీని ఏర్పాటుచేశారు. మండలఅధ్యక్ష,కార్యదర్శులుగాభవానిప్రసాద్, అశ్వత్థనారాయణ, ఉపాధ్యక్షులుగా భరత్, హరికృష్ణ, రాజకుమార్, సాయికిరణ్, సహాయ కార్యదర్శులుగా లోకేష్, ఉమేష్, నవతేజ్, ఉదయ్‌కిరణ్, గోవర్ధన్‌లతో పాటు 7 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి మండల వ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ కొని 5 మందికి గాయాలు

లేపాక్షి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

లేపాక్షినలోని జవహర్ నవోదయ విద్యాలయం ఎదురుగా రెండు మోటర్‌సైకిళ్లు ఢీ కొన్న సంఘటనలో 5 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ మునీర్‌అహ్మద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా వున్నాయి. మంగళవారం చిలమత్తూరు మండలంలోని కాపుచెన్నంపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున, ప్రదీప్ అనే ఇరువురు విద్యార్థులు హిందూపురం పట్టణంలోని శ్రీనివాస ఐటిఐ కళాశాలకు మోటర్‌సైకిల్‌పై వెళుతున్నారు. అయితే వారి ముందు చిలమత్తూరు మండలంలోని గాద్రాలపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణారెడ్డి నవోదయ విద్యాలయం ఎదురుగా వున్న మగ్గాల ఫ్యాక్టరీకి మోటర్‌సైకిల్‌పై వెళుతున్నాడు. క్రిష్ణారెడ్డి మగ్గాల ఫ్యాక్టరీకి వెళుతూ సిగ్నల్ కోసం చేయి చూపుతూ తిప్పుకుంటుండగా అతివేగంతో వెనుక వస్తున్న ఐటిఐ విద్యార్థులు క్రిష్ణారెడ్డిని ఢీ కొన్నారు. అంతేకాకుండా మగ్గాల ఫ్యాక్టరీ నుండి 5వ తరగతి చదువుతున్న డిశాంత్, కరీం పాఠశాలకు నడుచుకుంటూ వస్తుండగా ఐటిఐ విద్యార్థుల వాహనం ఢీ కొందన్నారు. వీరిలో ఒకరి తలకు గాయాలు కాగా మరొకరికి కాలు విరిగిందన్నారు. అయితే క్రిష్ణారెడ్డి బొటనవ్రేలు విరగగా ఐటిఐ విద్యార్థులు కూడా గాయపడ్డారు. వీరందరిని చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ఆర్టిసి బస్సు

**- ఇరువురికి తీవ్ర గాయాలు**



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి యువకులు

సోమందేపల్లి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : మండల పరిధిలోని నల్లగొంద్రాయునిపల్లి వై జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం ఆర్టిసి బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ఘటనలో ఇరువురు తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాల సముద్రం వద్ద కియా అనుబంధ సంస్థలలో పనిచే యడానికి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని శ్రావణి, భార్గవ్‌లు ద్విచక్ర వాహనంలో నల్లగొంద్రాయునిపల్లి వై జంక్షన్ దాటుతున్న సమయంలో పెనుకొండ, పావగడకు చెందిన ఆర్టిసి బస్సు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలైనట్లు తెలిపారు. క్షతగాత్రులు శ్రావణి నడుంపై నుంచి ఆర్టిసి బస్సు చక్రం దూసుకెళ్లడంతో ఆ భాగం నుజ్జునుజ్జైంది. ఈమె కూడేరు మండలం కురుట్ల గ్రామం కాగా, మరో యువకుడు వజ్రకరూరు మండలం కందికుంట గ్రామానికి చెందిన వాడు. భార్గవ్‌ను పోలీసు వాహనంలో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 108 వాహనంలో శ్రావణిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వీరిలో శ్రావణి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన ఆర్టిసి బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదే సమయంలో రోడ్డుపై వరి కుప్పలు అడ్డంగా ఉంచిన నల్లగొంద్రాయునిపల్లికి చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

## చిన్న కోడిపల్లి గ్రామలో ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

రొద్దం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : వైద్యాధికారి ఆదేశాల మేరకు మండల పరిధిలోని చిన్న కోడిపల్లి గ్రామంలో రాపిడ్ రెస్పాన్స్ టీం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివారం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి 70 మంది ప్రజలు రావడంతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీ హెచ్ఈఒ బి. శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా 70 మందికి బీపీ. షుగర్, . హెచ్‌బి. పర్సేంటేజ్ వంటి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, చికెన్ గూనియా, మలేరియా వంటి విషజ్వరాలు భారీ పడకుండా ప్రజలు ఆరోగ్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు, వ్యాధులు సోకవని ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.గిరినాథ్, ఏఎన్ఎం ధనలక్ష్మి, సుకన్న, ఆరోగ్య సహాయకులు మురళీ మోహన్, నబీరసూల్, వన్నూరప్ప, రవికుమార్, అంగన్‌వాడీ వర్కర్, ఆది రత్నమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మంచికి క్రమ-శిక్షణకు మారుపేరు నందమూరి కుటుంబం

**- కొడాలినాని పద్దతి మార్చుకో- లేకుంటే తోలుతీస్తాం**

**- మహిళా అధ్యక్షులు రాలు సుబ్బరత్నమ్మ, అధికార పత్రినిధి రొద్దం నరసింహులు**



ర్యాలీగా వెళ్తున్న టీడీపీ శ్రేణులు

రొద్దం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త : మంచికి మారుపేరు.. క్రమశిక్షణకు పెట్టింది పేరు నందమూరి కుటుంబం. అటువంటి కుటుంబంలోని ఆడపడుచును నానా దుర్భాషాలు మాట్లాడడం మంచి పద్ధతి కాదని.. పద్ధతి మార్చుకోకపోతే తోలుతీస్తామని మహిళా అధ్యక్షులురాలు సుబ్బరత్నమ్మ, అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు కొడాలినానికు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రం రొద్దం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యాలయానికి చేరుకుని అక్కడి నుండి పోలీసు స్టేషన్ వరకు కొడాలినాని జాగ్రత్త అంటూ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.



కేసు నమోదు పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కొడాలినానిపై కేసు నమోదు చేయాలని జమీందార్ నాగరాజును కోరారు. పోలీసులకు ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ కొడాలినాని పద్ధతి మార్చుకుని నోరు అదుపు ఉంచుకుని మాట్లాడాలని పలు మార్లు హెచ్చరించామని.. టీడీపీ నేతలు ఒక్కమారు కన్నెర్రె చేస్తే తట్టుకోలేవని మరో మారు హెచ్చరించారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం అయితే నీవు నివాసముంటున్న గ్రామానికే వచ్చి తంతామని ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిన్న అప్పయ్య, మాజీ సర్పంచ్ అశ్వర్థనారాయణ, టీఎన్‌టియూ నియోజకవర్గ అధ్యక్షులు వాల్మీకి చంద్ర, మహిళా నాయకురాలు లీలావతి, మండల ప్రధాన కార్యదర్శి మురళీ, అక్బర్, చంద్ర, నాగప్ప, సురేష్, నారాయణ, నాగరాజు, బేల్దారి కిష్ట, అనిల్ పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా కెంకెరలో మారెమ్మదేవి ఉత్సవాలు



మారెమ్మదేవతను ఊరేగింపు దృశ్యం

అమరాపురం సెప్టెంబర్ 13 ప్రభాతవార్త మండల పరిధిలోని కెంకెర గ్రామం బోవి కాలనీలో మంగళవారం మారెమ్మ దేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు భీమన్న, బెంగళూరు నగర బిజెపి ఉపాధ్యక్షులు బాలు, బాలాజీ బోవి కాలనీ వాసులు గోవిందరాజు, హనుంతరాయ తదితరుల సమక్షంలో మారెమ్మ దేవి మాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవత ఉత్సవ మూర్తిని దేవాలయం నుంచి భీమన్న ఆధ్వర్యంలో దిట్టే కట్ట వరకు ఊరేగింపు నిర్వహించి విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు హారతులతో విచ్చేసి అమ్మవారికి ప్రదర్శనలు చేసి పిండి హారతులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం నుంచి వచ్చిన పెద్దలకు సన్మానం చేశారు. అనంతరం మూగ జీవాలను దేవతకు బలిర్పణ చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని ప్రధాన దేవాలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి దేవాలయంలో ప్రతిష్టింపజేశారు. కర్నాటక నుంచి విచ్చేసిన వివిధ కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు.

# గాయపడిన వారికి ఆర్థికసాయం అందించిన పల్లె



గాయపడిన వారిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పల్లె

కదిరి టౌన్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

నల్లమాడ మండల పరిధిలోని యర్రవంకపల్లికి చెందిన నిరుపేద కూలీలు కూలిపనికి పోయి ఇళ్లకు తిరిగి వస్తున్న సందర్భంలో ఆటోలో వస్తున్న కూలీలను మంగళవారం 108 వాహనం ఢీ కొని తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ కూలీలను కదిరి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. నల్లమాడ మండల కేంద్రంలోని అన్నాక్యాంటీన్ కార్యక్రమంలో ఉన్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి ఈ సమాచారం అందడంతో హుటాహుటిన కదిరి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకునా న్రు. అక్కడ గాయపడిన కూలీలను పరామర్శించి వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. తీవ్రంగా గాయపడిన వారిని అనంతపురం, బెంగళూరు వైద్యశాలలకు తరలించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. గాయపడిన కూలీలను పరామర్శించి వారికి కొంత ఆర్థిక సాయం అందించారు. మీరువెరూ అందోళన చెందాల్సిన అవసరం లేదని అన్ని విదాలా మీకు కొండంత అండగా ఉంటానని వారికి భరోసా కల్పించారు. పల్లె వెంట టిడిపి నాయకులు, అన్నం లక్ష్మినారాయణ, శివప్రసాద్‌రెడ్డి, రామాంజినేయులు, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

# అక్రమ కట్టడాలు తొలగించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

కదిరి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :

కదిరి మున్సిపల్ పరిధిలోని సైదాపురం 206 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వాటిని తొలగించాలని మంగళవారం మున్సిపల్ కమీషనర్ శ్రీహరిబాబుకు టిడిపి నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు రాజశేఖర్‌బాబు, అల్ఫాముస్తఫా, చంద్రశేఖర్, తదితరులు మాట్లాడుతూ కదిరి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు అక్కడ నిర్మాణం చేపడుతున్న కొంత మంది వ్యక్తులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను చేపట్టడం సముచితం కాదన్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యపై అర్జీలు ఇవ్వడం జరిగిందన్నారు. అక్రమ కట్టడాలు కూల్చివేసి వారిపై చర్యలు తీసుకోవాలని కమీషనర్‌ను టిడిపి నాయకులు కోరారు.

# లేవు లేవు బియ్యం లేవు

## - ఎండియు వాహనం రాలేదంటూ తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన కాలనీ వాసులు



తహాశీల్దార్ కార్యాలయం ముందు నిరసన

ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

లేవు లేవు బియ్యం లేవు బియ్యం అయిపోయాయని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ తమపై ఎండియు వాహన ఆపరేటర్ అగ్రహం వ్యక్తుం చేస్తున్నాడని మండల కేంద్రంలోని బిసి హాస్టల్ సమీపంలోని ప్రజలు తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరికి గ్రేటర్ రాయలసీమ నాయకులు మున్నా, రామచంద్రలు సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మున్నా, రామచంద్ర, లబ్ధిదారులు మాట్లాడుతూ బిసి హాస్టల్ పరిసర ప్రాంతాల్లో దాదాపు 200 కుటంబాల వారు జీవనం సాగిస్తున్నారన్నారు.

ఈ కాలనీకి ఎండియు వాహనం వెళ్లి రేషన్ పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కాగా సదరు ఎండియు వాహనం ద్వారా ఏరోజు కూడా తమ కాలనీకి వచ్చి రేషన్ పంపిణీ చేయలేదన్నారు. మంగళవారం పక్క వీదిలో రేషన్ పంపిణీ చేస్తుండగా మా కాలనీకి వచ్చి బియ్యం ఇవ్వమని అభ్యర్థించగా లేవు లేవు బియ్యం లేవు బియ్యం అయిపోయినాయి మీరు ఎవరికైనా చెప్పుకోండి మీ కాలనీకి మా వాహనం రాదని తమపై ఆగ్రహం వ్యక్తం చేశాడన్నారు. కావున తమ కాలనీకి ఎండియు వాహనం వచ్చేలా చర్యలు తీసుకుని తమకు రేషన్ సరుకులు ఇప్పించ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ విఆర్‌ఏ రంగప్పకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటరమణప్ప, అలివేలమ్మ, యశోదమ్మ, రంగారెడ్డి, అబ్దుల్‌ఖాదర్, పుట్టమ్మ, భారతి, లక్ష్మిదేవి, నాగలక్ష్మి, గంగాద్రి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి చైత్ర ఆకస్మిక మృతి

అమడగూరు, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త



చిన్నారి చైత్ర (ఫోల్‌ఫోటో)

మండలంలోని ఏ.పుట్లవాండ్లపల్లి గ్రామానికి చెందిన పుట్ల శోభ, రమణప్ప కుమార్తె చైత్ర (18 నెలలు) మంగళవారం ఉయ్యాలలో పడుకుని నిద్రలోనే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చిన్నారి చైత్ర గత రెండు రోజుల నుండి బాలగ్రహాలు లాంటివి సోకడంతో తల్లిదండ్రులు చిన్నారికి చిటికెలు మంత్రాలు లాంటి కార్యక్రమాలు చేసి బాగా ఆడుకుంటుందని ఉయ్యాలలో నిద్రించే సమయంలో ఇలా అకస్మాత్తుగా మృతి చెందడం చాలా బాధాకరమని గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. రమణప్పకు ఒక కుమారుడు. మరణించిన చిన్నారి ఇద్దరు సంతానం అని బంధువులు తెలిపారు.

# నేడు త్రాగునీటి సరఫరాకు అంతరాయం

## - కమీషనర్ శ్రీహరిబాబు

కదిరి టౌన్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

కదిరి మున్సిపాలిటికి పార్నపల్లి చిత్రావతి నదినుంచి వచ్చే తాగునీటి సరఫరాలో నేడు(బుధవారం) అంతరాయం ఉన్నట్లు కదిరి మున్సిపల్ కమీషనర్ ఓ ప్రకటనలో తెలియచేశారు. రిజర్వాయర్ నుండి వచ్చే తాగునీరు మలకవేమల వద్ద నున్న పంప్‌హౌస్ నందు వాల్వ్, పైపులు పగిలిపోయి నీరు లీకేజి అవుతోందన్నారు. వాటిని మరమ్మత్తులు చేయడానికి ఒక రోజు సమయం పడుతుందని అందువల్ల 14వ తేదీన కదిరి పట్టణానికితాగునీరు సరఫరా చేయడానికి వీలు కాదన్నారు. కావున ఈ అంతరాయానికి పట్టణ ప్రజలు సహకరించాలని కమీషనర్ కోరారు.

# టిడిపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి- మాజీ మంత్రి పల్లె



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పల్లెరఘునాథరెడ్డి

నల్లమాడ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త,

వచ్చే ఎన్నికలో టీడీపీ అధికారంలో రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మైలే రామచంద్ర నివాసగృహం వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని వారికి దిశానిర్దేశం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వేధింపులు, దౌర్జన్యాలు మితిమీరి పోయాయని, మరోసారి వైసీపీ అధికారంలోకి వేస్తే టీడీపీ కార్యకర్తలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవడం ఖాయమన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని టీడీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యేందుకు రెయ్యింబవల్లు శ్రమించాలని హితవు పలికారు. వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉండి పక్కాగృహాల బిల్లులు, సంక్షేమపథకాలు అందని వారి జాబితాలను గ్రామాల వారిగా సిద్ధం చేసి తనకు అందజేస్తే మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి బిల్లు చెలించేలా మొదట ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మొదటిస్థానం నిలపాలని పల్లెరఘునాథరెడ్డి సూచించారు. ఇందుకు ప్రతి కార్యకర్త గ్రామగ్రామన పర్యటించి సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టాలన్నారు. టీడీపీ సభ్యత్వం పొందిన వారికి రూ.2లక్షలు ప్రమాదభీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెల్లాలని తెలియజేశారు.

# బికె పార్థసారధిని కలిసిన రాష్ట్ర ఎస్‌టిసెల్ అధికారప్రతినిధి

అమడగూరు, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త



బికె పార్థసారధిని సన్మానిస్తున్న భూక్య కాలెనాయక్

మండలంలోని మలకవారిపల్లి తాండాకు చెందిన రాష్ట్ర ఎస్‌టి సెల్ అధికారప్రతినిధి భూక్య కాలె నాయక్ మంగళవారం పెనుకొండ లోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బికె పార్థసారధిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందచేశారు. అనంతరం భూక్య కాలెనాయక్‌తో పాటు గోరంట్ల మండల మాజీ సర్పంచు రవినాయక్‌లు బికె పార్థసారధితో రాష్ట్రంలోని గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని పథకాలను రద్దు చేసిందని గొర్రెలు లోన్లు, విదేశీవిద్య, భూమి కొనుగోలు, సబ్సిడీ లోన్లు ఆర్థికంగా, రాజకీయంగా ప్రభావితం చేసే పదవులు లేవని తాండాలను ప్రత్యేకంగా గుర్తించి ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలని అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని పేర్కొనడం జరిగింది.

# కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని



# సందర్శించిన వైద్యాధికారి

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అమడగూరు, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

మండలంలోని గుండువారిపల్లిలో వున్న కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం వైద్యాధికారి డాక్టర్ షీఫాసుల్తానా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని పిల్లల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారికి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తగిన జా గ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. అనంతరం విదా ్యలయంలోని వంటగదిని పరిశీలించారు. కూరగాయలు, నీటి పరిశుభ్రతపై వంట చేసేవారికి తగిన సూచనలు ఇచ్చారు. అనంతరం 15 మంది బాలికలకు చికిత్సలు చేశారు. పిల్లల ఆరోగ్యం బాగుందని వారికి చెప్పే చదువుల పట్ల విద్యాలయపు సిబ్బందిని అభినందించారు. అనంతరం సిహెచ్‌ఓ ఫకృద్దిన్ దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే తమకు తెలపాలన్నారు. వెంటనే వారికి వైద్యం అందిస్తామని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇర్ఫాన్‌బాష, మేరీ, ఫార్మసిస్టు రాము, ల్యాబ్ టెక్నీషియన్ గాయత్రి, సచివాలయం ఎఎన్‌ఎం సుకన్య, ఆశ రుక్మిణి, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ అంబిక, ఎఎన్‌ఎం కవిత, ఉపాధ్యాయులు అనురాధ, కల్పన, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# సాఫ్ట్‌బాల్ పోటీల్లో రన్నర్స్‌గా ఓబుళరెడ్డిపల్లి

రన్నర్స్‌గా నిలిచిన జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, హెచ్‌యం.శ్రీవాత్సవరెడ్డి

తలుపుల,సెప్టెంబర్13,ప్రభాతవార్త:

పట్టుదల ఉంటే సాధించనిదేదీ లేదని నిరూపించారు ఓబుళరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఈ నెల 10వ తేదీ గుట్టూరులో జరిగిన జోన్-3 మిక్స్‌డ్ జెండర్ జోనల్ లెవల్ సాఫ్ట్‌బాల్ క్రీడా క్లబ్బులో పోటీల్లో తలుపుల మండలం ఓబుళరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటి రన్నర్స్‌గా నిలిచారు. గతంలో ఇదే పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు విధ్యార్థుల్లో విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తూ విధ్యార్థుల ప్రతిభను వెలికి తీస్తున్నారు. ఇప్పుడు జోన్-3 మిక్స్‌డ్ జెండర్ జోనల్ లెవల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విధ్యార్థులు జాన్‌విక్టర్‌రెడ్డి, రాహల్, తనూష్‌రెడ్డి, ఆదిశేషు, పండు, చరణ్ కుమార్, ఇమ్రాన్, తరుణ్, రామ్‌చరణ్, గౌరి, ఉష, బిందు, పావని, నందినీలను పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు శ్రీవాత్సవరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# నేడు అన్న క్యాంటీన్‌ను ప్రారంభిచనున్న పల్లె

ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని సచివాలయ సమీపంలో నేడు(బుధవారం) అన్న క్యాంటీన్‌ను మాజీ మంత్రి, పుట్టపర్తి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించనున్నారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుళరెడ్డిలు ఒక ప్రకటనలో తెలియచేశారు.

# ప్రతి ఇంటా సంక్షేమం

## - ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పథకం ద్వారా అందిన మొత్తాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

యాడికి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

నవరత్నాలతో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పచ్చారుమేకలపల్లి గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి బ్రోచర్లు అందచేస్తూ వివిధ పథకాల ద్వారా అందిన మొత్తాన్ని వివరించారు. అలాగే సమస్యలను ఆలకించారు. ఎస్‌సి కాలనీలో విద్యుత్ స్తంభాలను అడుగగా వెంటనే వేయాలని ట్రాన్స్‌కో ఎఇ రాజారాంను ఆదేశించారు. ముఖ్యంగా గడపగడపకు వెళ్లే క్రమంలో సచివాలయం, వాలంటీర్లు తికమక పెట్టడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. సమయం ఇచ్చినా తిరిగి గందరగోళం నెలకొనడంతో ఎమ్మెల్యే ఆగ్రహంతో వెంటనే అందరికి నోటీసులు జారీ చేయాలని ఎంపిడిఓ వెంకటేష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి వెంకటరామిరెడ్డి, బాలరమేష్‌బాబు, పరిమి చిన్నవెంకటనాయుడు, తలారి నాగేష్, చందన శివ, నాగేంద్రరెడ్డి, చలమారెడ్డి, కొట్టే వెంకటరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చితంబరి, తదితరులు పాల్గొన్నారు. మాజీ టిడిపి మండల కన్వీనర్ విజయనాయుడు ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి పలకరించారు. అదేవిధంగా ఓ వైపు కార్య క్రమం జరుగుతుండగా మండల నాయకులు పామిడి రూరల్ సిఐ రామకృష్ణకు ఓ కేసు విషయంలో పట్టించుకోలేదని చెప్పే ప్రయత్నం చేశారు. ఇందుకు సిఐ కూడా తాము చేసేది చేశామని ఏమి చేస్తారో చెప్పండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ నిర్లక్ష్యదోరణికి పోలీసులు బాధ్యులా అంటూ మాటమాట పెరుగుతుండగా పక్కనే వున్న ఇతర నాయకులు సర్దిచెప్పారు.

# ఘనంగా మాజీ మంత్రి చల్లా సుబ్బరాయుడు వర్ధంతి వేడుకలు

చిన్నారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం





చల్లా సుబ్బరాయుడు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

మాజీ మంత్రి చల్లా సుబ్బరాయుడు వర ్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా సుబ్బరాయుడు మనవడు గౌతమ్ ఆయన సమాధికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని యల్లనూరురోడ్డు సర్కిల్‌లో వున్న చల్లా సుబ్బరాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుండి ఆవులతిప్పాయపల్లి గ్రామంలోని శ్రీరమణమహర్షి అనాధశరణాలయంలోని 90 మంది పిల్లలకు దుస్తులు అందచేసి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార ్యక్రమంలో చల్లా సుబ్బరాయుడు మనవడు చల్లా గౌతమ్, కుమార్తె అమృతవల్లి, చల్లవారిపల్లి సర్పంచు సత్యనారాయణ, సర్పంచు కుమారుడు కళ్యాణ్‌చక్రవర్తి, గ్రామప్రజలు, పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సిహెచ్‌ఓ

యల్లనూరు, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని సిహెచ్‌ఓ మధుకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పాతపేటలో హెల్త్ కా ్యంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవారితో మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు పలు చోట్ల వర్షం నీరు డ్రైనేజి సరిగా లేని చోట్ల నిలిచిపోయిందన్నారు. దీంతో దోమల ఉత్పత్తి పెరిగి ప్రజలు అనారోగ్యం బారినపడే అవకాశం వుందన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తద్వారా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వుండేలా చూసుకోవాలన్నారు. ఎవరికైనా అనారోగ్యం కలిగితే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి అందుకు తగిన మందులను వాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు తిరుపాలయ్య, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థికి ఆర్థిక సాయం

తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త




ఆర్థిక సాయం అందచేస్తున్న రాధాకృష్ణ

పట్టణ సమీపంలోని గన్నె వారిపల్లికాలనీలో నివాసం వుంటున్న బండల పాలిష్ ఫ్యాక్టరీ కార్మికుడైన డి.పక్కీరప్ప కుమారుడు రఘునాథ్‌కు విజయమణి ఫౌండేషన్ తరపున మంగళవారం ఆర్థిక సాయం అందచేశారు. రఘునాథ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దీంతో కళాశాల రుసుము కొరకు విజయమణి ఫౌండేషన్ తరుపున రాధాకృష్ణ ఆర్థిక సాయం అందచేశారు.

# నేడు సన్మాన కార్యక్రమం

యల్లనూరు, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం అనంతపురం డివిజన్ డిఎల్‌డిఓగా పదోన్నతిపై వెల్లిన ఓబుళమ్మ, అలాగే ఎఓ నాగేశ్వరరెడ్డి, బదిలీపై వెల్లిన పంచాయతీ కార్యదర్శులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపిడిఓ రామచంద్రారెడ్డి, ఇఓఆర్‌డి విజయశేఖర్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని వారు కోరారు.

# పద్మవాణి హైస్కూల్లో ఆత్మీయ సమావేశం




మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

పట్టణంలో మంగళవారం పశ్చిమరాయలసీమ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి రామచంద్రారెడ్డి విస్తృత పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని పద్మవాణి హైస్కూల్‌లో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అభ్యర్థిత్వానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఆన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) అధ్యక్షులు, ఎంఎల్‌సి అభ్యర్థి అయిన రామచం ద్రారెడ్డి గత 30 సంవత్సరాలుగా విద్యారంగ అభివృద్ధికి కృషిచేస్తున్నానని అపుస్మా ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కానికి కృషి చేస్తూ ప్రభుత్వ విద్యాకార్యక్రమాలకు మావంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రాబోవు టీచర్స్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను బలపరిచి గెలిపించినటు ్ల అయితే టీచర్స్‌కు పాఠశాలలకు మధ్య సమన్వయకర్తగా పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన తెలియచేశారు. ఈ సమావేశంలో అపుస్మా స్టేట్ అసోసియేషన్ అడ్వైజర్ జి.నాగపీరయ్య, తాడిపత్రి ప్రైవేటు స్కూల్స్ అధ్యక్షులు నాగవీరారెడ్డి, స్టేట్‌వైస్‌ప్రెసిడెంట్ కడప రమణారెడ్డి, నార్పల సంజీవరెడ్డి, తాడిపత్రి ప్రైవేటుస్కూల్స్ అసోసియేషన్ కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, భవన కార్మికులకు కళ్యాణమస్తు పథకానికి అక్టోబర్ 1 నుండి శ్రీకారం చుడుతుండడం పట్ల సిఎం జగన్‌తో పాటు ఎమె ్మల్మే కేతిరెడ్డి పెద్దారెడ్డిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తూ సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గురుశంకర్, 35వవార్డు కౌన్సిలర్ రాఘువేం ద్రప్రసాద్, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభాకరబాబు, విజయభాస్కర్, భాస్కర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పెద్దిరాజు, దళిత సంఘాల వైసిపి అనుబంధ సంఘాల నాయకులు బాలచంద్రనాయుడు, ఓబులేసు, అడిపన్న, వెంకటశివ, బుగ్గ కర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

యాడికి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త



మృతి చెందిన గణేష్ (ఫైల్‌ఫోటో)

యాడికి పట్టణానికి చెందిన ఉక్కిసల గణేష్ (26) అనే విద్యార్థి చికిత్స పొందుతూ మంగళవారం కర్నూల్ ఆసుపత్రిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉక్కిసల వెంకటనారాయణ కుమారుడు గణేష్ తాడిపత్రిలో బిటెక్ చదువుతున్నాడు. అయితే ఇటీవల గణేష్ యాడికి పట్టణంలో బి స్టోర్ ఏర్పాటు చేశాడు. ఇందులో భారీగా నష్టం వచ్చింది. ఆరి ్ధకంగా నష్టపోవడంతో పాటు ఇటీవల పరీక్షా ఫలితాల్లో తిరిగి కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడం జరిగింది. దీంతో దిక్కుతోచని పరిస్థితికి దారితీసింది. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక తీవ్రమనస్థాపానికి గురయ్యాడు. దీంతో ఇంటిలో విషపుగుళికలు మింగాడు. పరిస్థితి గమనించిన తండ్రి వెంకటనారాయణ చికిత్స నిమిత్తం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే విద్యార్థి చేసిన అప్పులను తల్లిదండ్రులు తీర్చినట్లు తెలిసింది.

# పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

## - 18 మంది అరెస్టు - 24 బైకులు, 24 సెల్‌ఫోన్లు స్వాధీనం

## - పేకాట రాయుళ్ల నుంచి 2,05050 నగదు స్వాధీనం



విలేకర్లతో మాట్లాడు తున్న ఎస్‌ఐ రాజేష్

పేకాట రాయుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు ←

కంబదూరు, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త

కంబదూరు మండల పరిధిలోని కురాకుల పల్లి గ్రామ సమీపాన కర్ణాటక- ధ్ర సరిహద్దులో ఉదయం 8 గంటల సమయంలో 15 మంది స్పెషల్ పార్టీ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజేష్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్పెషల్ పార్టీ పోలీసులు, కంబదూరు పోలీసులు మఫ్టీలో వెళ్లి పేకాట స్థావరాలకు చేరుకుని 18 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 24 సెల్‌ఫక్షన్లు, 24 బైకులు, 2,05,050 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట స్థావరాల వద్దకు వెళ్లగానే కొంత మంది వారి బైకులను, సెల్‌ఫోన్లను వదిలి పరారైనట్లు తెలిపారు. పరారైన వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల సమాచారం ఇలా ఉండగా.. మరిన్ని వివరాలు ఏమిటంటే సుమారు 15 మంది స్పెషల్ పార్టీ పోలీసులు రైతులు, మెకానిక్‌ల వేషధారణల్లో పేకాట స్థావరాల వద్దకు వెళ్లి అక్కడున్న పేకాటరాయుళ్లతోపాటు కలిసి పోయి వారితో కాసేపు పేకాట ఆడినట్లుకూడా తెలిసింది. అప్పటికే కంబదూరు పోలీసులకు అక్కడున్న పోలీసులు సమాచారం ఇవ్వడంతో స్థానిక పోలీసులు పేకాట స్థావరాన్ని చుట్టుముట్టి అరెస్టు చేసినట్లు తెలిసింది. కొంతమంది పేకాట స్థావరాల నుంచి పారిపోతున్నప్పుడు చెట్ల పొదల్లో డబ్బులు దాచారని వినికిడి. అంతేకాకుండా ఆ ఏరియాలో గొర్ల కాపర్లకు డబ్బులు ఇచ్చి పారిపోయినట్లు కూడా తెలిసింది. గత రెండేళ్లగా కురాకుల పల్లి పరిసర ప్రాంతాల్లో జూదం ఆడుతున్న విషయాలు సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా పట్టించుకోకపోవడంతో ఆ ఏరియా గ్రామస్తులు జిల్లా ఎస్పీ పక్కీరప్పకు ఫోన్ చేసి విషయాలు తెలపడంతో ఎస్పీ చొరవ తీసుకుని స్పెషల్ పార్టీ పోలీసులను గాంబ్లింగ్ స్థావరాల వద్దకు పంపినట్లు సమాచారం.

